PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 112 | విజయవాడ, గురువారం 23 నవంబర్ 2023 | 26 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 23 November 2023 | Rs

మోడీ ప్రభుత్వాన్ని ఓడిస్తేనే దేశానికి రక్షణ

- 27, 28న మహాధర్నా
- బుక్‌లెట్ ఆవిష్కరణలో మాజీ మంత్రి వడ్డే

2

స్మార్ట్ మీటర్లపై సర్కారుకు నోటీసు

ప్రజాశక్తి-అమరావతి

వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు జారీ చేసింది. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు, అనుబంధ పరికరాలను బిగించే కాంట్రాక్టును షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కు అప్పగించడాన్ని సవాలు చేస్తూ టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎపిలో అధిక ధరలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని కోర్టుకు పిటిషనరు తరపున న్యాయవాది తెలిపారు. మీటర్ల ఏర్పాటుపై స్టే విధించాలని కోరారు. స్టే ఇవ్వలేమంటూనే ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ సహా ఎపిలోని మూడు డిస్కమ్‌ల ఎమ్‌డిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబరు 20కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.



సదస్సులో మాట్లాడుతున్న మల్లేపల్లి లక్ష్మయ్య, వేదికపై బి.వెంకట్ తదితరులు

సమాజ నిర్మాణంలో పటిష్టమైన పునాది విద్య

- శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

లోపలి పేజీలో..



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే

హక్కులకు రక్షణ

- 2024లో బిజెపిని ఓడిస్తేనే దేశ మనుగడ
- ఉద్యమాల ద్వారానే దళిత, గిరిజనులకు సమానత్వం
- దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం కోసం' రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగానికి, దళిత, గిరిజనులకు, మహిళలకు, సామాజిక తరగతుల హక్కులకు గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో కనీస రక్షణ కరువైంది. అందరం ఐక్యమై రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే హక్కులకు రక్షణ లభిస్తుంది' అని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. దేశంలో 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని, మోడీని ఓడిస్తేనే దేశానికి మనుగడ, దళిత, గిరిజనుల హక్కులను రక్షణ అని స్పష్టం చేశారు. అందుకోసం జరిగే పోరాటాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం కోసం' రాష్ట్ర స్థాయి సదస్సు విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగింది. కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్, ఎఐఎడబ్ల్యుయు, ఎఐఆర్ఎల్ఎ, డిబిఎస్‌యు, డిబిఎఫ్, పిఎంసి వంటి సామాజిక, ప్రజాసంఘాల రాష్ట్ర కమిటీలు ఈ సదస్సు నిర్వహించాయి. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సిడిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో దళితులు, గిరిజనులు నేటికీ వారి కష్టాల నుంచి బయటకు రాలేకపోయారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో యువతకు ఉపాధి కరువైందన్నారు. దేశంలో అదానీ, అంబానీ, టాటాల ఆస్తులు విపరీతంగా పెరిగాయని, ప్రజల డబ్బులో 80 శాతం బడా వ్యక్తుల వద్దే ఉందని తెలిపారు. దేశ సంపద, వ్యవసాయ, పారిశ్రామిక

మిగతా 2లో

విభజన హామీలు, విశాఖ, కడప స్టీల్‌ప్లాంట్లపై నాటకాలు ఆపండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై వి శ్రీనివాసరావు

లోపలి పేజీలో..

క్రమబద్ధీకరణ ముసుగులో

పెద్దలకు అసైన్డ్ భూములు

మార్కెట్ రేటు కంటే రెండున్నర రెట్లు చెల్లిస్తే భూ యాజమాన్యపు హక్కులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ముసుగులో ప్రభుత్వం తమ అనుయాయులకు, పెత్తందార్లకు భూములు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. పేదల ముసుగులో గ్రామాల్లోని భూ స్వాములు, బడాబాబులు, పెత్తందార్లకు ఆయా భూములను కట్టబెట్టేందుకు ప్రభుత్వం దొడ్డిదారిన మార్గాన్ని సుగమం చేస్తూ నిబంధనలు రూపొందించింది. అసైన్‌మెంట్ భూములు అనుభవిస్తున్న వ్యక్తికి ఎలాంటి కార్డు లేకపోయినప్పటికీ, భూమిలేని నిరుపేద కాకపోయినా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మార్కెట్ రేటు కంటే రెండున్నర రెట్లు భూ యజమాని చెల్లిస్తే సరిపోతుందని ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో భూ యాజమాన్యపు హక్కులు కల్పించే ముసుగులో బడాబాబులకు పాలకపక్షం పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చనున్నట్లు స్పష్టమవుతోంది. భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు దారిద్ర్యపు రేఖకు దిగువున ఉన్న వారైతే మార్కెట్ రేటు చెల్లిస్తే సరిపోతుందని ప్రభుత్వం పేర్కొంటోంది. అయితే వారు బిపిఎల్ పరిధిలో ఉండాల్సి ఉంటుందని, అలా కాకుండా అర్హత లేని వారైతే వారి పట్టా రద్దు చేసి, భూమి తీసుకుంటామని, అలా గాక మార్కెట్ రేటుకు రెండున్నర రెట్లు చెల్లిస్తే వారికి కూడా యాజమాన్యపు హక్కులు కల్పిస్తామంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా 27.14 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల్లో 15.21 లక్షల మందికి యాజమాన్యపు హక్కులు కల్పిస్తున్నట్లు ఇటీవల సిఎం ప్రకటించారు. రెవెన్యూశాఖ నుంచి అందుతున్న సమాచారం మేరకు 10.60 లక్షల ఎకరాలు మాత్రమే నిజమైన అసైనీల చేతుల్లో ఉన్నట్లు లెక్కలు తేల్చాయి. మిగిలిన భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయా? లేక ఆక్రమణలకు గురయ్యాయా? అనే విషయంపై ప్రభుత్వం లెక్కలు తీసే పనిలో ఉన్నట్లు సమాచారం.

భూమి లేని పేదలు వ్యవసాయం చేసుకునేందుకు వీలుగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అసైన్‌మెంట్ కమిటీల ద్వారా భూ పంపిణీ జరిగింది. భూముల పంపిణీ జరిగి 20 సంవత్సరాలు దాటిన నిజమైన లబ్ధిదారులకు భూ యాజమాన్యపు హక్కులు కల్పించడం ద్వారా పేదలకు ఆయా భూములపై (ఫ్రీ హోల్డ్ రైట్స్ ఆర్ అసైన్‌మెంట్ ల్యాండ్స్) దక్కనున్నాయి. ఆయా భూములను వారి అవసరాలకు ఎప్పుడైనా అమ్ముకునే హక్కు (బదలాయింపు) చేసుకునే అవకాశం కలుగుతుంది.

> ❑ <u>Someone else in possession without recorded transactions</u>:
> - To resume the land wholly.
>
>   (Or)
> - To provide alienable to the part of the land on payment of 2.5 times of market value (as per LARR Act 2013) and to resume the remaining land.
>
> పెద్దలకు అసైన్డ్ భూములు కట్టబెట్టేందుకు ఉద్దేశించిన నిబంధన ఇదే

అసలైన లబ్ధిదారుని గుర్తించే ప్రక్రియ ఇలా..

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన భూములకు భూ యాజమాన్యపు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు కింది మార్గదర్శకాలను సూచించింది. భూ యజమాని అసలైన లబ్ధిదారుడా? లేక వారసులా? తహశీల్దారు కార్యాలయంలోని డి పట్టా ఫైలు, 10(1) అడంగల్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. మాన్యువల్ పట్టాదారు పాస్ పుస్తకం, 1బి రిజిస్టర్, అడంగల్, వెబ్‌ల్యాండ్‌లో అసలైన లబ్ధిదారుని వివరాలు ఉన్నాయా అనే విషయాన్ని గుర్తించాలి. వారసుల విషయానికి వస్తే ఇసిలో లేకపోయినా, స్థానికంగా ఆ భూమి గురించి విఆర్ఓ పంచనామా నిర్వహించాలి. భూ యజమాని లేక వారసుల ఫొటోలను భూమి వద్ద తీయాలి. గత కొన్ని సంవత్సరాలుగా ఇ-క్రాప్ బుకింగ్, రైతు భరోసా అందుతుందా లేదా పరిశీలించాలి. భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో 9(2) 10(2) నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అనంతరం అసలైన భూ యజమానికి సంబంధించిన డాక్యుమెంట్లతో సహా ఫైలును తుది నిర్ణయం తీసుకునేందుకు జిల్లా స్థాయి కమిటీకి పంపాల్సి ఉంటుంది. అప్రూవల్ అయిన అనంతరం భూ యజమానికి భూ యాజమాన్యపు హక్కులు ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వం పేర్కొంటోంది.

వ్యవసాయేతర భూముల ప్రక్రియ ఇలా..

అసైన్‌మెంట్ ల్యాండ్ వ్యవసాయేతర భూమిగా మార్చుకుని ఉంటే అందులో మొత్తంగా మార్చుకుంటే నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెన్‌మెంట్ కింద ప్రభుత్వానికి చెల్లించాల్సిన నగదు కట్టించుకోవాల్సి ఉంటుంది. నిబంధనలకు లోబడి ఎన్ఒసి కట్టుకోవాలి. పంచాయతీలకు సెస్ కట్టిన అనంతరం నాన్ అగ్రికల్చరల్ కింద సర్టిఫికెట్ ఇస్తారు. కొంత భాగం వ్యవసాయేతర భూమిగా మార్చుకుని ఉంటే ఆ భూమి యజమాని దారిద్ర్యపు రేఖకు దిగువున ఉన్న వారైతే భూమిని లబ్ధిదారుని పేరు మీదనే ఉంచాలని సూచించారు.

రాష్ట్రాన్ని డ్రగ్స్ అడ్డాగా మార్చిన ప్రభుత్వం

- డివైఎఫ్ఐ విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. డ్రగ్స్ రవాణాను అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు ఘోరంగా విఫలమయ్యారని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు మెడికల్ కళాశాలలో గంజాయి ప్యాకెట్లు దొరికాయని, ఒంగోలు రిమ్స్ కళాశాలలో గంజాయి సేవించి విద్యార్థులు కొట్టుకున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం జీవితాలను నాశనం చేసే గంజాయిని అరికట్టలేకపోయిందని విమర్శించారు. కళాశాల, హాస్టళ్లలోకి గంజాయి ఎలా వచ్చిందో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి తరచూ హాస్టళ్లను పర్యవేక్షించాలని కోరారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సిఎం జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌పై రేపు విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని ఎంపి రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్.. సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణకు రానుంది. అక్రమాస్తుల కేసులో గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని, కేసులపై విచారణ వేగవంతం చేయాలని గతంలో తెలంగాణ హైకోర్టులో రఘురామ పిటిషన్ చేశారు. దీనిపై తెలంగాణ హైకోర్టులో సిబిఐ కౌంటర్ దాఖలు చేసింది. అనంతరం రఘురామ పిటిషన్‌ను కొట్టేస్తూ న్యాయస్థానం తుది ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సుప్రీంకోర్టులో ఎంపి రఘురామ సవాల్ చేశారు. ఈ క్రమంలో జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం శుక్రవారం జరిపే విచారణ జాబితాలో రఘురామ పిటిషన్‌ను చేర్చింది. పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

కృష్ణా ట్రిబ్యునల్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి కేంద్రం నోటిఫై చేసిన విధివిధానాలపై అభ్యంతరం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ట్రిబ్యునల్ వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను బుధ, గురువారాల్లో జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేయాల్సి ఉంది. బుధవారం విచారణ సందర్భంగా స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు వివరాలు అందజేయాలని ఏపి, తెలంగాణను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ జనవరి 22కు వాయిదా వేసింది. మరోవైపు కేంద్రం నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు చెబుతూ ఏపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ఈ నెల 29న విచారణకు రానుంది.

26న తిరుమలకు ప్రధాని రాక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు ప్రధాని నరేంద్ర మోడీ తిరుమలకు రానున్నారు. రాత్రి అక్కడే బస చేసి 27న ఉదయం ఎనిమిది గంటలకు శ్రీవారిని దర్శించుకోనున్నారు. స్వామివారి దర్శనం చేసుకున్న అనంతరం మహబూబాబాద్, కరీంనగర్‌లో జరిగే బహిరంగ సభల్లో పాల్గొననున్నారు.

వైసిపిలోకి జనసేన సందీప్

- సజ్జల సమక్షంలో పార్టీలో చేరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం కార్యదర్శి పసుపులేటి సందీప్, రాయలసీమ రీజియన్ ఇన్‌ఛార్జి పద్మావతి జనసేనకు రాజీనామా చేసి వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారు బుధవారం పార్టీలో చేరారు.

పవన్‌కల్యాణ్ తన స్వార్థం కోసం ఎంతోమందిని బలిచేస్తున్నారని సందీప్ పేర్కొన్నారు. తమ కుటుంబం ప్రజారాజ్యం స్థాపించినప్పటి నుండి పవన్‌కల్యాణ్‌తో వుందని, ఆయన స్వార్థ రాజకీయాలు తెలుసుకునే బయటకు వచ్చామన్నారు. సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గొప్పగా వున్నందునే వైసిపిలో చేరాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

మోడీ ప్రభుత్వాన్ని ఓడిస్తేనే దేశానికి రక్షణ


- 27, 28న మహాధర్నా
- బుక్‌లెట్ ఆవిష్కరణలో మాజీ మంత్రి వడ్డే



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న వడ్డే తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల ఐక్య వేదిక కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. కార్పొరేట్లకు అనుకూలంగా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడిస్తేనే ప్రజాస్వామ్యానికి, దేశానికి రక్షణ అని పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో కర్షక, కార్మిక ప్రజా సంఘాల సమన్వయ సమితి ముద్రించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతోందని అన్నారు. రైతు, కార్మిక, వ్యవసాయ కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం పోరాటాలు చేసే ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయిస్తోందని అన్నారు. బిజెపిని 2024లో ఇంటికి పంపాలని అన్నారు. 385 రోజుల వీరోచిత పోరాటంతో మోడీ ప్రభుత్వాన్ని మెడలు వంచి వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేసుకున్న స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసులు మాట్లాడారు. దేశవ్యాప్తంగా కరువు తాండవిస్తోందని, ప్రజలంతా కరువు కోరల్లో కూరుకుపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని 679 మండలాల్లో 475 మండలాలు కరువు తీవ్రత అధికంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించిందని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులపై ఉక్కుపాదం మోపుతోందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనం పాటించడం తగదన్నారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలోని జింఖానా మైదానంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ బుక్‌లెట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, సిఐటియు రాష్ట్ర నాయకులు వి ఉమామహేశ్వరరావు, కె ఉమామహేశ్వరరావు, ముజఫర్ అహ్మద్, ఎపి రైతు సంఘం నాయకులు కెవిపి ప్రసాద్, పి జమలయ్య, ప్రజా సంఘాల నాయకులు సిహెచ్ బాబురావు, దోనేపూడి శంకర్, ఎం రామకృష్ణ, ఎ రవిచంద్ర, పి దుర్గాభవాని, దయా రమాదేవి, చంద్రానాయక్, ఎం హరిబాబు, ఎస్ అనిల్, శ్రీనివాస్, పరుచూరు రాజేంద్ర, యన్ లెనిన్, వి జాన్సన్ బాబు, ఆర్‌వి నర్సింహారావు, సుప్రజ, ఎ కమల తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కుమార్తె వివాహం గుంటూరు జిల్లా మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో బుధవారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వధువు రేష్మా ప్రియాంక, వరుడు అమోఘ్ సతీష్‌లకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వెంట పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఉన్నారు.

బకాయిల కోసం కాంట్రాక్టర్ల ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో పెద్దయెత్తున కాంట్రాక్టర్లు తరలివచ్చి బుధవారం ధర్నా నిర్వహించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోట్ల పెట్టుబడులు పెట్టి వడ్డీలు చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. ముందుగా పనులు చేసిన వారికి చెల్లించడం లేదని పేర్కొన్నారు. 175 నియోజకవర్గాల్లో కేవలం రెండు నియోజకవర్గాల కాంట్రాక్టర్లకే చెల్లిస్తూ మిగిలిన వారిపై వివక్ష చూపుతోందని పేర్కొన్నారు. ఆర్థికశాఖ అసంబద్ధ చెల్లింపులు చేస్తోందని విమర్శించారు. ఈ ఆందోళనకు ఎపి బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు సంఘీభావం తెలిపారు. అసోసియేషన్ నాయకులు సిహెచ్ రామకోటయ్య మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం దృష్టికి సమస్యను పలుమార్లు తీసుకొచ్చినా న్యాయం జరగలేదన్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో పనుల నిర్వహణలో స్తబ్దత ఏర్పడిందని సభ్యులు రాఘవరావు అన్నారు. తమపై ఆధారపడ్డ ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. నాయకులు శేఖర్‌బాబు మాట్లాడుతూ.. పనుల నిమిత్తం వడ్డీకి అప్పులు చేశామన్నారు. కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

చుక్కల భూముల తొలగింపు చేపట్టండి

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, భూయజమానులకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తున్న నేపథ్యంలో 22(ఎ)లో చుక్కల భూముల కింద నమోదైన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సిసిఎల్ఎ అడిషనల్ సెక్రటరీ ఎఎండి ఇంతియాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి పలు సూచనలు చేశారు. చట్టంలోని సెక్షన్ 4(1) కిందకు వచ్చే చుక్కల భూములన్నీ రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని 22(ఎ)(1)(బి) కింద ఉంచాలని, చట్టంలోని సెక్షన్ 4(2) కేటగిరి కిందకు వచ్చే అన్ని చుక్కల భూములు రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని 22(ఎ)(1)(బి) కింద ఉంచాలని పేర్కొన్నారు. అన్ని చుక్కల భూములు 9/77 చట్టంలోని నిబంధనలకు లోబడి, అసైన్‌మెంట్ విషయంలో రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని (22(ఎ)(1)(ఎ) కింద ఉంచబడతాయన్నారు. చట్టంలోని సెక్షన్ 4(3) చుక్కల భూముల చట్టం-2017లోని నిబంధనల మేరకు రికార్డుల సంతృప్తికి లోబడి మిగిలిన భూములు 22(ఎ) నుంచి తొలగించాలని సూచించారు.

విశాఖలో విషాదం

- లారీని ఢీకొన్న స్కూలు ఆటో
- 8 మంది విద్యార్థులకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- సీతమ్మధార, మధురవాడ (విశాఖపట్నం)

విశాఖలో బుధవారం ఉదయం వేర్వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో 15 మంది పాఠశాల విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనల్లో ఇద్దరు ఆటో డ్రైవర్లూ గాయపడ్డారు. ఆటోల్లో విద్యార్థులు స్కూళ్లకు వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... విశాఖ నగరంలోని సంగం-శరత్ థియేటర్ పక్కన ఖజానా జ్యూయలరీ ఎదురుగా లారీని ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ఆటోలోని బేతనీ స్కూలుకు చెందిన నలుగురు బాలురు, నలుగురు బాలికలు గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో మళ్ల వాణీ జయరాం, ఎ.హాసినిప్రియ, గాయత్రి, లక్ష్య, చార్విక్, యషు, కుశల్, భావేష్ ఉన్నారు. వీరిలో హాసినిప్రియ తీవ్రగాయాలపాలవడంతో సెవెన్ హిల్స్ ఆసత్రిలో చికిత్స అందిస్తున్నారు. చిన్నారుల్లో ముగ్గురు సాయంత్రానికి డిశ్చార్జి అయ్యారు. ఆటో డ్రైవర్ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనలో గాయపడిన వారిని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. చిన్నారులను పరామర్శించిన వారిలో వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు, టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ప్రమాద ఘటనపై సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.



గాయపడిన విద్యార్థిని పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్

మధురవాడలోనూ మరో రోడ్డు ప్రమాదం

జివిఎంసి ఏడో వార్డు పరిధిలోని మధురవాడ నగరంపాలెం రోడ్డులో పంది అడ్డుగా రావడంతో పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ఆటోలోని ప్రయివేటు పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ కూడా గాయపడ్డారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- డిసెంబరు 30న ధర్నా
- పోస్టరు ఆవిష్కరించిన యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిసెంబరు 30న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నాను యుటిఎఫ్ నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పోస్టరును పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ బుధవారం విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, ఉన్నత పాఠశాలల్లోని అన్ని పోస్టులనూ అప్‌గ్రేడ్ చేయాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 2022 జూన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు, మున్సిపల్ యాజమాన్యం నుంచి పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి వచ్చాయని పేర్కొన్నారు. తమ ఫెడరేషన్ చేసిన ప్రత్యేక కృషి వల్ల సేవా పుస్తకాలు, కేడర్ స్ట్రెంత్ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. మౌలిక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని చెప్పారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల మాదిరి మున్సిపల్ టీచర్ల పోస్టులనూ సబ్జెక్టు టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాల్సి ఉందని తెలిపారు. అయినా ఉన్నత పాఠశాలల్లో ఎస్‌జిటిలుగా కొనసాగుతున్నారని అన్నారు. పాఠశాలల్లో పెరుగుతున్న పిల్లల సంఖ్యకు అనుగుణంగా సబ్జెక్టు టీచర్ల కొరతను తగ్గించేందుకు వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, ప్రమోషన్లు, అప్‌గ్రేడేషన్ అమలు చేస్తామని విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీ నెరవేరలేదని విమర్శించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పాఠశాలలకు అద్దె, కరెంటు బిల్లుల బకాయిలు చెల్లించాలని, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు జరపాలని దశలవారీ పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28 తేదీల్లో మున్సిపాల్టీల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని, 29న డిఇఒ, కలెక్టర్లకు నోటీసులు అందిస్తామని తెలిపారు. డిసెంబరు ఒకటిన పాఠశాల విద్యాశాఖ కమిషనరుకు నోటీసు ఇస్తామన్నారు. 5న మున్సిపల్ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, 12, 13 తేదీల్లో అన్ని మున్సిపాల్టీల్లో ప్రచారం, 15న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపడతామని, 20 నుంచి 23 వరకు జిల్లాల సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి ఎస్‌పి మనోహర్‌కుమార్, ప్రచురణ కమిటీ ఛైర్మన్ ఎం హనుమంతరావు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసరావు, ఎ సుందరయ్య పాల్గొన్నారు.

ఐసెట్‌లో 17,396 మందికి సీట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల ప్రవేశ పరీక్ష ఐసెట్-2023 అడ్మిషన్ల తుది కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ముగిసింది. మొత్తం 17,396 మంది అభ్యర్థులకు సీట్లను కేటాయించామని సెట్ కన్వీనర్, ఎపి ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ కె రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 22,301 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో అర్హత సాధించిన 20,670 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నారని వివరించారు. చివరిగా 17,396 మందికి సీట్లు కేటాయింపు జరిగినట్లు తెలిపారు.

ప్రధానికి లేఖ రాసినా గంజాయి తీవ్రత తగ్గలేదు : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న డ్రగ్స్ దందాలు కట్టడి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాసిన తరువాత వాటి తీవ్రత మరింత పెరిగిందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వైద్య కళాశాలలు డ్రగ్స్ అడ్డాలుగా మారాయని కర్నూలు, ఒంగోలు మెడికల్ కళాశాలల్లో గంజాయి బ్యాచుల దాడులతో స్పష్టమైందని పేర్కొన్నారు. యువత భవిత నాశనమవుతుందనే ఆందోళనతో ప్రధాన మంత్రికి లేఖ రాశానని వివరించారు. విశాఖలో జరిగిన పాఠశాలల పిల్లల ఆటో ప్రమాదం తనను షాక్‌కు గురిచేసిందని మరో ప్రకటనలో పేర్కొన్నారు.

తవ్వకాలపై స్టేటస్‌కో

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నంలోని కైలాసగిరి కొండ దిగువన తవ్వకాలపై యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంటు అథారిటీ (విఎంఆర్‌డిఎ) కమిషనరును హైకోర్టు ఆదేశించింది. తవ్వకాలకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంది. తెన్నేటి పార్కుకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం కారు పార్కింగ్ కోసం కొండ దిగువన చెట్ల పొదలను తొలగించి, చదును చేస్తున్నామే తప్ప, అక్కడ ఎలాంటి షాపులనూ నిర్మించడం లేదని విఎంఆర్‌డి తరఫున న్యాయవాది వరికూటి సూర్య కిరణ్ తెలిపారు. దీనిని హైకోర్టు రికార్డ్ చేసింది. విచారణను డిసెంబరు 13కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కైలాసగిరి కొండను తవ్వి నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంలో జోక్యం చేసుకుని తగిన ఉత్తర్వులు జారీ చేయాలంటూ జనసేన కార్పొరేటర్ పికె యాదవ్ పిల్ దాఖలు చేశారు.

ప్రభుత్వ జిఓ రద్దు కోరుతూ ప్రజాహిత వ్యాజ్యం

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, తొట్లకొండ వద్ద ఉన్న బౌద్ధక్షేత్రం పరిధిని తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఓను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. 2021లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ 131ను రద్దు చేయాలని కోరుతూ పర్యావరణ వేత్త ఎల్ రాణిశర్మ పిల్ దాఖలు చేశారు. బౌద్ధక్షేత్రానికి చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత ఉందని పిటిషనరు తరఫున సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి హైకోర్టుకు తెలిపారు.

ఈ ప్రాంతం విస్తీర్ణాన్ని కుదిస్తూ ప్రభుత్వ జిఓను గోప్యంగా ఉంచిందని చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. ఇదే అంశంపై ఇప్పటికే కొన్ని పిల్స్ దాఖలు అయ్యాయని చెప్పారు. 1976 నుంచి ఇప్పటి వరకు 120 ఎకరాల్లోనే బౌద్ధక్షేత్రం ఉందన్నారు. వాదనల తర్వాత హైకోర్టు.. విచారణను డిసెంబరు 20కు వాయిదా వేసింది.



శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ద్రౌపది ముర్ము

సమాజ నిర్మాణంలో పటిష్టమైన పునాది విద్య

- శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- విద్యార్థులకు పిహెచ్‌డిలు, పిజి పట్టాలు, బంగారు పతకాలు ప్రదానం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

'ఒక భవన నిర్మాణానికి పునాది ఎంత ప్రధానమైనదో సమాజ నిర్మాణానికి విద్య అంతటి ప్రధానమైనది' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలో జరిగిన శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మెరుగైన సమాజ నిర్మాణానికి విద్య అవసరమన్నారు. విద్య నైతిక విలువలను, జీవన విలువలను అందిస్తుందని తెలిపారు. ఉన్నతమైన విద్య విజ్ఞానాన్ని అందించడమే కాకుండా సమాజ పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పుట్టపర్తిలో సమగ్రమైన విద్యను సత్యసాయి ట్రస్టు ద్వారా అందిస్తుండడం అభినందనీయమన్నారు. 'సత్యం వద... ధర్మం చర' అన్న నినాదాన్ని సత్యసాయిబాబా ప్రకటించినట్టుగా ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మాన్ని ఆచరించాలని సూచించారు. మహాత్మాగాంధీ కూడా సత్యశోధన ప్రాధాన్యతను ఎప్పుడూ చెప్పేవారని గుర్తు చేశారు. దీనికి ముందు 14 మందికి పిహెచ్‌డిలు, 500 మందికి డిగ్రీలు, పిజి పట్టాలు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 21 మందికి బంగారు పతకాలను అందజేశారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ప్రాచీన ఆధ్యాత్మిక సంపద ఎంతో విలువైనదన్నారు. ప్రాచీన గురుకుల విద్య తరహాలోనే సత్యసాయి విద్యా సంస్థల్లోనూ విద్యను అందించడం ముదావహమని పేర్కొన్నారు. 'విద్యా దదాతి వినయం... వినయాద్యాతి పాత్రతాం' అని చెప్పినట్టుగా విద్య ద్వారా వినయం... వినయం ద్వారా అర్హత... అర్హత ద్వారా సంపద అన్నీ వస్తాయని వివరించారు. సమగ్రమైన విద్యను పొందడం ద్వారా విజ్ఞానం పొందడమే కాకుండా సమాజాభివృద్ధికి తోడ్పడినవారమవుతామన్నారు. సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ హాలులో జరిగిన స్నాతకోత్సవాన్ని విశ్వవిద్యాలయం ఛాన్సలర్ కృష్ణమాచారి చక్రవర్తి ప్రారంభించారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, వైస్ ఛాన్సలర్ రాఘవేంద్రప్రసాద్ ప్రసంగించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఎస్.నాగానంద్ తదితరులు పాల్గొన్నారు. ఒడిశాలోని జహర్సుగూడ నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి చేరుకున్న రాష్ట్రపతికి విమానాశ్రయంలో అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఘనస్వాగతం పలికారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాలులోని సత్యసాయి మహాసమాధిని ముర్ము దర్శించుకున్నారు.

'ఉక్కు' పరిరక్షణకు ఒత్తిడి పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్రంపై అన్ని వైపుల నుంచీ ఒత్తిడి పెంచాలని సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1014వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ క్యూఎటిడి, ఇన్‌స్ట్రుమెంటేషన్, డిఎన్‌డబ్ల్యు, ఇటిఎల్, టెలికం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికవర్గం ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఎంఆర్.నాగేశ్వరరావు, రామచంద్రరావు, హనుమంతరావు, గుమ్మడి నరేంద్ర, నాయక్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం మండలంలోని కేతనకొండ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రక్కన నిలిచి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు అరకులోని ప్రకృతి అందాలు తిలకించేందుకు కారులో వెళ్లారు. అరకు పర్యటన అనంతరం తిరుగుప్రయాణం అయ్యారు. బుధవారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నంలోని కేతనకొండ వద్దకు చేరుకోగానే కారు డ్రైవరు నిద్ర మత్తులో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంలో కూర్చున్న నిజామాబాద్ చెందిన ధర్మతేజ (23), హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన శాంతి కుమార్ (23) అక్కడికక్కడే మరణించారు. కారులో ఉన్న మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సిఐ పి శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే హక్కులకు రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తులు, సేవా రంగాల్లో దళిత, గిరిజనుల శ్రమ దాగి ఉందన్నారు. నేటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు ఉద్యమం, దళిత ఉద్యమం రెండూ అత్యంత అవసరమని పేర్కొన్నారు.

దళిత శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దళిత, గిరిజన హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ నినాదంతో డిసెంబర్ 4న ఛలో ఢిల్లీ కార్యక్రమం 150 సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన జరగనుందని తెలిపారు. దీనిని జయప్రదం చేయాలని కోరారు. ప్రస్తుత ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపిని సాగనంపితే 2024 ఎన్నికల్లో దేశానికి శుభం కలుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రభుత్వ పథకాలకు తమ పేర్లు పెట్టుకోవడం ఒక పిచ్చిగా మారిందన్నారు. అహ్మదాబాద్ స్టేడియం పేరును నరేంద్ర మోడీ స్టేడియంగా మార్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో విదేశీ విద్యకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విదేశీ విద్యా పథకం అని ఉండగా, జగనన్న విద్యా దీవెనగా మార్చడం దారుణమన్నారు. చంద్రయాన్‌కు కూడా మతం రంగు పులిమి 'శివశక్తి' అని మార్చారని, నిజానికి ఆ ల్యాండర్‌కు విక్రమ్ సారాబాయి పేరు ఉండేదని తెలిపారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ ఫొటో పెట్టానని మోడీ గొప్పలు చెబుతున్నారని, అదే పార్లమెంట్ హాలులో దళిత, గిరిజన హక్కులను కాలరాసే శాసనాలను ఎన్నో చేశారని గుర్తు చేశారు.

ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ దేశంలో బిజెపిని ఒంటరి చేసి ఓడించే శక్తులన్నీ ఏకం కావాల్సి ఉందన్నారు. గతంలో దళిత, గిరిజన హక్కులను కనీసం ప్రభుత్వాలు గుర్తించేవని, నేడు ఆర్ఎస్ఎస్, బిజెపి వాటిని గుర్తించడానికి సైతం నిరాకరిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రంగాన్ని అమ్మేస్తోందన్నారు. ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ.రామ్మూర్తి మాట్లాడుతూ దేశంలో 25 శాతం ఉన్న దళితులు రానున్న రోజుల్లో బిజెపి వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని కోరారు. సదస్సులో డిబిఎస్‌యు వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్, రాష్ట్ర అధ్యక్షులు పి.చిట్టిబాబు, బికెఎంయు జాతీయ ఉపాధ్యక్షులు ఆవుల శేఖర్, ఆర్‌పిఐ (ఎ) జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకరరావు, సిఐటియు విశాఖ జిల్లా నాయకులు ఎం.జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తోన్న దాడులు, యుద్ధంపై ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం, దళిత, గిరిజనుల హక్కుల రక్షణపైనా, వారిపై దాడులకు వ్యతిరేకంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రవేశపెట్టిన తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

చరిత్రను వక్రీకరించొద్దు

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠ్య పుస్తకాల్లో చరిత్రను వక్రీకరిస్తూ తీసుకొచ్చిన సిఫార్సులు వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన విద్యా విధానం (ఎన్ఇపి)తో విద్యారంగంలో కొత్త మార్పు తీసుకొస్తామంటూ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని బిజెపి అమలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. చరిత్ర పాఠ్యాంశాల్లో క్లాసికల్ విభాగం కింద రామాయణం, మహాభారతం, ఆయుర్వేద వంటి తిరోగమన భావాలను చిన్నపిల్లల మెదడులో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మనువాదాన్ని జొప్పించడం రాజ్యాంగానికి విరుద్ధమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో రామాయణం, మహాభారతం వంటివి చేర్చాలని ఎన్సిఇఆర్టి సిఫార్సు చేయడాన్ని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని కోరారు. ఉన్నత స్థాయి కమిటీ ఇలాంటి నిర్ణయాలు చేయడం వల్ల సమాజానికి ముఖ్యంగా విద్యార్థులకు తీవ్ర నష్టమని తెలిపారు. తక్షణమే ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కులగణన నిర్ణయం హర్షణీయం

- రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కులగణన చేపడతామన్న నిర్ణయం హర్షణీయమని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిసిల పార్టీగా చెప్పుకునే టిడిపి ఇప్పటి వరకూ బిసిలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంది తప్ప వారిని సామాజిక, రాజకీయ, ఆర్థిక సాధికారత సాధించే దిశగా ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఇతర పార్టీలన్నీ బిసిలను ఓటర్లుగా మాత్రమే చూస్తారని, జగన్ మాత్రమే తమ కుటుంబ సభ్యులుగా చూస్తారని అన్నారు. రాష్ట్రంలో బస్సు యాత్రలకు జనం నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు.

విభజన హామీలు, విశాఖ, కడప స్టీల్‌ప్లాంట్లపై నాటకాలు ఆపండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై వి శ్రీనివాసరావు



ఫిషింగ్ హార్బర్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

ప్రత్యేక హోదా, విభజన హామీలు, కడప, వైజాగ్ స్టీల్‌ప్లాంట్లు, విశాఖకు దక్షిణ కోస్తా రైల్వే జోన్ వంటి విషయాల్లో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి నాటకాలు కట్టిపెట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విశాఖలోని ఎన్‌పిఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరం వరుస ప్రమాదాలు, మత్స్యకారుల బోట్లు మంటల్లో దగ్ధం కావడం, స్కూలు పిల్లల వాహనాలు ప్రమాదాలకు గురికావడం వంటి ఘటనలతో విషాదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికవర్గం చేస్తోన్న పోరాట ఫలితంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో కేంద్రం ఒక్క అడుగూ ముందుకు వేయలేకపోయిందని తెలిపారు. అయినప్పటికీ ప్లాంట్ ఊపిరి తీసే విధంగా బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసెయ్యడం, ఐరన్ ఓర్, కోల్ రాకుండా అడ్డుకోవడం వంటి చర్యలతో ఉత్పత్తి సామర్థ్యాన్ని బలహీనపరచాలని చూస్తోందన్నారు. ఆ చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగిపోయిందంటూ విశాఖ వేదికగా కపట ప్రకటనలు చేస్తూ జనాల చెవిలో పువ్వులు పెడదామని చూశారని, ఆయన ఆటలు సాగవని అన్నారు. కేంద్రంలో బిజెపిని 2024 ఎన్నికల్లో అధికారంలోకి రాకుండా చేస్తేనే వైజాగ్ స్టీల్ ప్రయివేటీకరణ ఆగుతుందని తెలిపారు.

విభజన హామీలపై ఢిల్లీ డ్రామాలెందుకు?

విభజన హామీలపై చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యాన కమిటీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీకి పంపడం ఎన్నికల ముందు దేనికని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. విభజన హామీల్లో భాగంగా కడప స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం నిర్మించాల్సి ఉండగా, దానిపై ఒత్తిడి తేకుండా గతంలో జిందాల్ బృందంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయించడం మోసం కాదా? అని నిలదీశారు. కడప ప్రజలకు జగన్ ద్రోహం తలపెడుతున్నారన్నారు. రైల్వే జోన్‌పై బిజెపి నేతలైన జివిఎల్ వంటి వారు రోజుకో మోసపు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. రైళ్లు వేసేస్తామంటూ ఇస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయని, వాస్తవానికి ప్రజలు ప్రయాణించేందుకు రైళ్లు విశాఖ నుంచి సక్రమంగా లేవని అన్నారు. విశాఖలో రైల్వే జోన్ అంశంపైనా కేంద్రం నాటకాలాడుతోందని, రైల్వే జోన్‌కు భవనం లేదనడం సరైంది కాదని తెలిపారు. స్వార్థ రాజకీయాల కోసం కేంద్రం వద్ద వైసిపి మోకరిల్లి కంటితుడుపు ప్రకటనలను ఎన్నికల ముందు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. విశాఖలో పంచ గ్రామాల సమస్యను పరిష్కరించకుండా నివాసం ఉండే వారు ఇళ్ల రిపేర్లు చేసుకోవచ్చని ప్రభుత్వం చేసిన ప్రకటన సరైంది కాదన్నారు. అక్కడి వారేమీ దురాక్రమణ చేసిన వారు కాదని తెలిపారు. అప్పుల పాలైన రైతులకు రైతు భరోసా ఏమూలకొస్తుందని ప్రశ్నించారు. ఆ మొత్తంతో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడదని తెలిపారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

బోట్ల యజమానులకు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించాలి

ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలోకాలిపోయిన బోట్ల యజమానులకు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించాలని, బోట్లపై ఆధారపడి జీవిస్తున్న కళాసీలకు, చిరు వ్యాపారులకు భృతి చెల్లించాలని వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో భద్రతా చర్యలు, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. ఫిషింగ్ హార్బర్‌లో ఇటీవల ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సిపిఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. అనంతరం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బోటు కోల్పోయిన వారికి బోటు ఇవ్వాలని, అందులోని డీజిల్, వల, వంట సామగ్రి వంటి ఇతరత్రా వాటికి కూడా లెక్కగట్టి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మత్స్యవేటతో సంబంధం ఉన్న నిపుణులతో కమిటీ వేసి నష్టాన్ని అంచనా కట్టాలన్నారు. హార్బర్‌లో నిఘా వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.



అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

పంట నష్టపరిహారమివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పంట నష్టపరిహారం, ఇతర వ్యవసాయ అనుబంధ సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. అంతకుముందు ఎండిపోయిన పత్తి, కంది, వేరుశనగ పంటలతో నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాభావంతో అనంతపురం జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించినా కరువు సహాయక చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో పంటలన్నీ పూర్తిగా చేతికందకుండా పోయాయని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రతి రైతుకూ స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎకరాకు గరిష్టంగా రూ.50 వేలు, వర్షాభావం వల్ల విత్తనం కూడా వేయలేని రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక కుటుంబాల విద్యార్థుల అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలన్నారు. వలసలను నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, పంట సాగుచేసిన కౌలు రైతులకే పంట నష్టపరిహారం ఇవ్వాలని, రైతుల బ్యాంకు అప్పులన్నింటినీ మాఫీచేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఒ గాయత్రీదేవికి అందజేశారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టుపై పొన్నవోలు వ్యాఖ్యలు దారుణం

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బెయిల్ ఇచ్చి హైకోర్టు పరిధి దాటిందని అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యానించడం దారుణమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు బెయిల్ రావడాన్ని వైసిపి నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. చంద్రబాబును ప్రజల్లోకి రానివ్వకుండా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు నిందితులంతా బయటే ఉన్నారని పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి తెలియదా? అని నిలదీశారు. న్యాయాధికారులు ఎవరూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడడం గతంలో తాను చూడలేదన్నారు. సుధాకర్‌రెడ్డి అదనపు అడ్వకేట్ జనరల్‌గా కాకుండా వైసిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని, జగన్‌కు ఏజెంటుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. సిఐడి అదనపు డిజి సంజయ్ మాదిరిగా పోలీసు ఉన్నతాధికారులు గతంలో ఎవ్వరూ రాజకీయ పరమైన వ్యాఖ్యలు చేయలేదన్నారు.

వసతి గృహాలకు వార్డెన్ల కొరత

- పోస్టుల భర్తీలో ప్రభుత్వం ఉదాసీనత
- ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్న దుస్థితి
- అస్తవ్యస్తంగా నిర్వహణ

ప్రజాశక్తి- విజయవాడ ప్రతినిధి

వెనుకబడిన తరగతుల ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది సరిపడిన సంఖ్యలో వార్డెన్లు లేకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఒక్కో వార్డెన్ రెండు వసతి గృహాలకు, కొన్నిచోట్ల మూడు వసతి గృహాలకు ఇన్‌ఛార్జులుగా ఉంటుండడంతో విద్యార్థుల పర్యవేక్షణ వారికి తలకు మించిన భారంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే దుస్థితి ఉంది. 13 ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లతో కలిపి రాష్ట్రంలో 747 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వీటిల్లో 559 బాలురవి, 188 బాలికలవి. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు వీటిల్లో ప్రవేశాలు కల్పించారు. ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులను వసతి గృహాల్లో చేర్చుకున్నారు. వీటితోపాటు ఇంటర్ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు చదివే వారికి 362 కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 93 వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఒక్కో వసతి గృహానికీ ఒక్కో వార్డెన్ అవసరం. ఈ లెక్కన 747 ప్రీ మెట్రిక్ వసతి గృహాలకు 747 మంది, 362 పోస్టు మెట్రిక్ హాస్టళ్లకు 362 మంది ఉండాలి. పోస్టు మెట్రిక్‌తోపాటు ప్రీ మెట్రిక్‌లో వసతి గృహాల్లో కూడా సరిపడిన సంఖ్యలో వార్డెన్లు లేరు. కళాశాల వసతి గృహాల్లో 25 శాతం, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో దాదాపు 400 వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో, విద్యార్థుల పర్యవేక్షణ, వారికి మెనూ ప్రకారం అందించాల్సిన ఆహారం, ఇతర వసతులు, సిబ్బంది హాజరు, పర్యవేక్షణ కష్టంగా మారింది. ఉన్న వార్డెన్లకే రెండు, మూడు వసతి గృహాల బాధ్యతలను అధికారులు బలవంతంగా అప్పగించారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం పూనుకోవడం లేదు. గత నాలుగేళ్లుగా ఇన్‌ఛార్జులతోనే వసతి గృహాలను నెట్టుకొస్తోంది. 747 ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో 545 వసతి గృహాలకు ప్రభుత్వ భవనాలను నిర్మించగా, 202 వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి సొంత భవనాల నిర్మాణంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

ధాన్యం సేకరణకు నిధులెలా!

- రూ. 15,733 కోట్లు అవసరం
- గత సీజన్ బకాయిలు కూడా పెండింగే



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ధాన్యం సేకరణకు, ఇతర అవసరాలకు రూ.15,733 కోట్లు కావాలని పౌరసరఫరాల శాఖ ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపించింది. ఇప్పటికే పాత బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న ఈ కొత్త నిధులను ఎలా సమకూర్చాలన్నదానిపై ఆర్థికశాఖ కూడా తలపట్టుకుంటోంది.

2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు సంస్థ వద్ద నిధులు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రక్రియ ముందుకు సాగలేదు. రాష్ట్రంలో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక్కో మెట్రిక్ టన్నుకు 22,030 రూపాయలు చొప్పున 8,151 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. అలాగే రెండు శాతం మార్కెట్ ఫీజు కింద 163 కోట్లు, రవాణా ఛార్జీల కోసం 186 కోట్లు, సొసైటీ కమిషన్ కోసం 118 కోట్లు, వడ్డీ కింద 233 కోట్లు, గోనె సంచుల కొనుగోలుకు 362 కోట్లు కావాల్సి ఉంటుందని అంచనా వేశారు. ఇవి కాకుండా సిఎంఆర్ రవాణా, కూలీలకు చెల్లింపులు, నిల్వ వంటి వాటికి కూడా ప్రతిపాదనలు పంపించారు. ఇలా మొత్తం ధాన్యం సేకరణ, అనుబంధ వ్యయం కోసం 10,147 కోట్లకు ప్రతిపాదించారు.

ఇవి కాకుండా గత సీజన్లలో చేసిన ఖర్చులకు సంబంధించి మరో 2,015 కోట్లు బకాయిలుగా ఉన్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. ఇలా గత సీజన్లలో చెల్లించాల్సిందే ఇంకా ఆర్థికశాఖ నుంచి రాకపోవడంతో కొత్త నిధులు ఎంతవరకు వస్తాయన్నదానిపై ఆ శాఖ అధికారులే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్ సేకరణకూ నిధులు

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా వచ్చే ఐదు నెలలకు సరుకులను సరఫరా చేసేందుకు కూడా పెద్దమొత్తంలోనే నిధులు కావాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి వరకు రూ.3,245 కోట్లు కావాల్సి ఉంటుందని తమ ప్రతిపాదనల్లో సంస్థ అధికారులు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని సమకూర్చాల్సిందిగా పౌర సరఫరాల శాఖ అధికారులు ఆర్థికశాఖను కోరుతున్నారు.

కావాల్సిన నిధుల వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	నిధులు
ధాన్యంకొనుగోలు	10,147
గత బకాయిలు	2,015
సరఫరాదారులకు	325
వచ్చే 5 నెలలకు	3,245
మొత్తం అవసరమైన నిధులు	15,733

ద్రవ్యోల్బణ కట్టడికి అన్ని ప్రయత్నాలు

- సుస్థిరత కోసమే వ్యక్తిగత రుణాలపై వెయిటేజీ
- ఆర్‌బిఐ గవర్నర్ దాస్ వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ధరల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. బుధవారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫిక్కీ), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) సంయుక్తంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో శక్తికాంత దాస్ పాల్గొని మాట్లాడారు. తాను ఇటీవల ఓ విమానాశ్రయానికి వెళితే అక్కడే ఉన్న సిఐఎస్ఎఫ్ బృందం కూడా అధిక ధరలు, వడ్డీ రేట్ల గురించి ప్రశ్నలడిగారని దాస్ తెలిపారు. ప్రజలకు ఆర్థిక అంశాలపై ఎంతో అవగాహన ఉందన్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో అహారోత్పత్తుల ధరలు ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉన్నాయన్నారు. ద్రవ్యోల్బణం క్రమంగా అదుపులోకి వస్తోందన్నారు. అమెరికా ట్రెజరీ రాబడులు అధికంగా ఉన్నప్పటికీ.. రూపాయి స్వల్ప స్థాయిలోనే ఒత్తిడిని ఎదుర్కొందన్నారు. ధరల ఒత్తిడిని అధిగమించాలంటే వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా, మార్కెటింగ్‌లో సంస్కరణలు అవసరమన్నారు. రుణాల జారీలో సుస్థిరత సాధించాలన్న లక్ష్యంతోనే వ్యక్తిగత, క్రెడిట్ కార్డు రుణాలపై రిస్క్ వెయిట్‌ను పెంచినట్లు తెలిపారు. వృద్ధిని దృష్టిలో పెట్టుకునే గృహ, వాహన రుణాలను అందులోంచి మినహాయించామన్నారు. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థపై ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. అయినప్పటికీ బ్యాంకులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనలో దళిత సంఘాలు

శ్మశాన స్థలం కోసం మృతదేహంతో ధర్నా

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ దళితులు బుధవారం గుంటూరు జిల్లా తెనాలిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలి చెంచుపేటకు చెందిన టి.కాశయ్య గుండెపోటుతో మృతి చెందారు. ఖననం చేసేందుకు స్థలం లేకపోవడంతో సమీపంలోని ఇతర శ్మశానవాటికల్లో ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాల పెద్దలు అంగీకరించకపోవడంతో శ్మశానవాటిక కోసం ఆందోళన చేశారు. ఆ సమయంలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చి వెళ్లిపోయారు. అనంతరం గురవయ్య కాలనీ శివారులోని శ్మశాన వాటికలో మృతదేహాన్ని ఖననం చేశారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు చిలకా కిరణ్ మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి వచ్చిన సందర్భంగా దళితుల శ్మశాన వాటిక కోసం రూ.9 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని, ఇప్పటికీ అధికారులు శ్మశానాలకు స్థలాల కొనుగోలు చేయలేదని విమర్శించారు. దీనిపై జాప్యం ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో బి.కోటయ్య, పి.క్రాంతి, బ్లెస్సి, జాన్సన్, కిషోర్, పవన్, మృతుని బంధువులు పాల్గొన్నారు.

జొమాటో, స్విగ్గీలకు జిఎస్‌టి నోటీసులు..!

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలైన జొమాటో, స్విగ్గీలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్(డిజిజిఐ) నోటీసులు జారీ చేసిందని సమాచారం. జొమాటో రూ.400 కోట్లు, స్విగ్గీ రూ.350 కోట్ల విలువైన జిఎస్‌టి ఎగవేశాయని రిపోర్టులు వస్తున్నాయి. ఫుడ్ డెలివరీ అనేది ఒక సర్వీస్ కాబట్టి దాని పన్ను శ్లాబుకు తగినట్లు జిఎస్‌టి చెల్లించాలని డిజిజిఐ తెలిపింది. ఈ సేవలపై 5 శాతం పన్ను రేటు అమల్లో ఉంది.

ఎయిరిండియాకు రూ.10 లక్షల జరిమానా

న్యూఢిల్లీ : ఎయిరిండియాకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఎయిరిండియాకు భారీ షాక్ ఇచ్చింది. పౌర విమానయాన నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ డిజిసిఎ నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాల్లో నిర్లక్ష్యం చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఢిల్లీ, కొచ్చి, బెంగళూరు విమానాశ్రయాల్లో నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించింది. విమాన సర్వీసులు ఎటువంటి పరిస్థితుల్లో రద్దు అయినా, ఆలస్యమయినా, ఏదైనా కారణంచేత ప్రయాణికులను బోర్డింగ్‌కు అనుమతించకున్నా ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. అదే విధంగా అంతర్జాతీయ బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు పరిహారం చెల్లింపుల్లో ఎయిరిండియా విఫలమైనట్లు తనిఖీల్లో గుర్తించినట్లు వెల్లడించింది. దీనిపై నవంబర్ 3న నోటీసులు జారీ చేస్తూ.. రూ.10 జరిమానా చెల్లించాలని ఎయిరిండియాను ఆదేశించింది.

త్వరలో ఖాళీ పోస్టులు భర్తీ : భూమన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇంజనీరింగ్, విద్యాశాఖ ఇతర ప్రధాన విభాగాల్లోని ఖాళీ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. పద్మావతి అతిథిగృహంలో ఇఒ ఎవి ధర్మారెడ్డి, జెఇఒ సదాభార్గవితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టిటిడిలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు, ఇంజనీరింగ్ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఉద్యోగాలిప్పిస్తామని దళారుల మాటలు ఎవరైనా నమ్మితే నిరుద్యోగులు మోసపోతారని హెచ్చరించారు. మెరిట్‌ను బట్టే ఉద్యోగాలు తప్ప, డబ్బులిస్తే రావన్న విషయాన్ని గుర్తించాలన్నారు. శ్రీనివాస విశేష హోమం గురువారం నుంచి నిరంతరాయంగా జరుపుతామని, వర్చువల్ విధానంలోనూ భక్తులు పాల్గొనవచ్చని తెలిపారు.

సంపాదకీయం

నిలువెత్తు నిర్లక్ష్యం

సుదీర్ఘ నిరీక్షణ తరువాత ఉత్తరాఖండ్ సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికుల గురించి ఆశావహ సమాచారం అందుతోంది. మంగళవారం వారి వీడియో ఫుటేజిని విడుదల చేసిన అధికారులు బుధవారం సాయంత్రం మరో సానుకూల సమాచారాన్ని అందచేశారు. మరో 12 మీటర్ల డ్రిల్లింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, అది పూర్తయితే బాధితులను క్షేమంగా బయటకు తీసుకురాగలమన్నది ఈ సమాచార సారాంశం. అధికారుల అంచనా ప్రకారం గురువారం సాయంత్రానికల్లా సొరంగం లోపల చిక్కుకుపోయిన కార్మికులు బయటకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఆ తరువాతే వారి ఆరోగ్యానికి సంబంధించిన వాస్తవ స్థితిగతులు వెల్లడవుతాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని సంఘటన స్థలం వద్ద అత్యవసర వైద్య సేవలకోసం అవసరమైన ఏర్పాట్లను కూడా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. అధికారుల తాజా ప్రకటనలు కొంత మేరకు ఊరటనిస్తున్నాయి. అయితే, ప్రస్తుతం జరుపుతున్న నిలువు డ్రిల్లింగ్ విధానంపై నిపుణులు ఇంకా అనుమానాలు వ్యక్తం చేస్తుండటం ఆందోళనకరం. వారి అనుమానాలు నిజమైతే సమస్య మళ్లీ మొదటికొస్తుంది. ఎంత కష్టమైనప్పటికీ శిధిలాల కింద చిక్కుకున్న కార్మికులందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావాలి. ఈ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి కావాలి. దేశమంతా ఇదే కోరుకుంటోంది.

ఈ నెల 12వ తేదీన ప్రమాదం జరిగితే మొదటి రెండు రోజుల్లో నామమాత్రపు సహాయ చర్యలే జరిగాయి. ఆ మాటకొస్తే మొదటి వారం రోజులు తర్జన భర్జనల్లోనే అధికార యంత్రాంగం మునిగిపోయింది. ఏం చేయాలి.. ఎలా చేయాలన్న అయోమయమే నెలకొంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఎనిమిది రోజుల పాటు ఒక్క అంగుళం కూడా సహాయ చర్యల్లో ముందడుగు పడలేదు. డబుల్ ఇంజన్ సర్కారు అని చెప్పుకునే రాష్ట్రంలో ఈ దుస్థితి ఏమిటి? అన్ని వైపుల నుండి ఒత్తిడి పెరగడంతో ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా ఈ పరిస్థితి ఎందుకు కొనసాగింది? ఇంత జరుగుతున్నా రోజుల తరబడి ప్రధాని ఎందుకు స్పందించలేదు? ఎన్నికల ప్రచారంలోనో, క్రికెట్ గ్రౌండ్‌లోనో ఉండవచ్చు. కానీ, ప్రాణాల కోసం పోరాడుతున్న ఈ 41 మంది కార్మికులు కూడా దేశ ప్రజలే కదా! సొంత ఇమేజ్‌ను ప్రచారం చేసుకోవడానికి చూపే శ్రద్ధలో వందో వంతు పెట్టినా సహాయ చర్యలు ముమ్మరమయ్యేవి కదా!

పర్యావరణ పరంగా ఉత్తరాఖండ్ అత్యంత సున్నితమైన ప్రాంతం. మంచు కొండలు, హిమ నదులు ఎక్కువ! కొండ చరియలు విరిగిపడటం, అకస్మిక వరదలు, భూకంపాలు ఇక్కడ తరచూ చోటుచేసుకుంటూ ఉంటాయి. కానీ, ఈ సున్నితత్వాన్ని, పర్యావరణ ప్రాముఖ్యతను కేంద్ర, రాష్ట్ర బిజెపి సర్కార్లు ఏ మాత్రం పట్టించుకున్నట్లు కనిపించవు. రాజకీయంగా లబ్ధి పొందడమే లక్ష్యంగా చేపట్టిన ఆధ్యాత్మిక టూరిజంలో ఇటువంటి ప్రాంతాల్లోనే భారీ నిర్మాణాలు చేపట్టడం దీనికి నిదర్శనం. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ఉత్తర కాశీ జిల్లాలోని సిల్క్యారా సొరంగం కూడా అటువంటిదే. చార్‌ధామ్ హైవే ప్రాజెక్టులో భాగంగా ధారాసు నుండి యమునోత్రి కలిపే రహదారిలో వందల కోట్ల రూపాయల అంచనాతో ఈ సొరంగాన్ని చేపట్టారు. ఇదొక్కటే కాదు. గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను కలుపుతూ 12,000 కోట్ల రూపాయలతో చేపట్టిన చార్‌ధామ్ ప్రాజెక్టులో అధికభాగం లూజ్ సాయిల్‌తో ఏర్పాటైన కొండలున్న ప్రాంతాల్లోనే సాగుతోంది. అయినా భారీ యంత్రాల వినియోగం యథేచ్ఛగా జరుగుతోంది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాల సంఖ్య కూడా పెరుగుతోందని చెబుతున్నారు. గత ఏడాదిలోనే చిన్నా, చితక స్థాయిలో కొండ చరియలు విరిగిపడిన సంఘటనలు అధికారిక రికార్డుల ప్రకారమే వెయ్యిదాకా చోటుచేసుకున్నాయి. కుంభవృష్టుల సంఖ్య కూడా భారీగా పెరుగుతోంది. వీటిని మోడీ సర్కారు నామమాత్రంగా కూడా పట్టించుకోవడం లేదు. విపత్తు బాధితుల పట్ల, వారి కష్టాల పట్ల కూడా అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం.

మహనీయుల మాట



ఆలోచనలు తుపాకుల కంటే శక్తిమంతమైనవి. శత్రువులు మన దగ్గర తుపాకులను వుండనివ్వరు.

- జోసెఫ్ స్టాలిన్

సందర్భం

మార్గదర్శి, స్ఫూర్తి ప్రదాత శంకరయ్య

కామ్రేడ్ ఎన్.శంకరయ్య వందవ పుట్టినరోజు సందర్భంగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు జి.రామకృష్ణన్ 2021 జులై 18న రాసిన వ్యాసమిది. శంకరయ్య మరణానంతరం నివాళులు అర్పిస్తూ 'పీపుల్స్ డెమోక్రసీ' పునఃముద్రించింది.

1922 జులై 15న జన్మించిన కామ్రేడ్ ఎన్.శంకరయ్య ఎన్.ఎస్‌గా సుపరిచితుడు. 2021 జులై 15వ తేదీన ఆయన తన వందవ సంవత్సరంలోకి ప్రవేశించాడు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, భావజాల, సాంస్కృతిక తదితర రంగాలలో తనదైన ముద్ర వేసిన గొప్ప యోధుడు. అటు రాజకీయ రంగంలో, ఇటు కుటుంబ జీవితంలో ఒక కమ్యూనిస్ట్‌గా ఉండడం ఎలా అనేందుకు ఆయన జీవితమొక నమూనాగా నిలుస్తుంది. మనకు మార్గనిర్దేశం చేస్తూ, స్ఫూర్తినిస్తుంది.

శంకరయ్య యువకుడుగా ఉన్న రోజుల్లో సామాజిక సంస్కరణలు, నాస్తికత్వ విధానాలతో కూడిన ఆత్మగౌరవ ఉద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. ఆ సమయంలో, కమ్యూనిస్టు పార్టీ మాత్రమే సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదాన్ని ముందుకు తీసుకొచ్చింది. శంకరయ్య ఈ పరిణామాలన్నిటినీ గమనించి, ఆర్థిక సమానత్వంతో కూడిన కుల రహిత సమాజానికి దారితీసే సామాజిక మార్పే దీనికి పరిష్కారమనీ, ఈ లక్ష్యం దిశగా మానవాళిని నడిపించేది కూడా మార్క్సిజం మాత్రమే అనే నిర్ణయానికి వచ్చాడు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే శంకరయ్య భారత కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడయ్యాడు. మధురై జిల్లాలో ఏర్పడిన మొట్టమొదటి పార్టీ శాఖ కూడా ఇదే.

రాజకీయ ఖైదీగా...

మధురై లోని అమెరికన్ కళాశాల విద్యార్థి సంఘానికి శంకరయ్య అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. అతి కొద్ది కాలంలోనే ఆయన రాష్ట్ర స్థాయి విద్యార్థి నాయకునిగా గుర్తింపు పొందాడు. పోలీసులు అరెస్ట్ చేసిన అన్నామలై విశ్వవిద్యాలయం విద్యార్థులపై జరిగిన హింసాత్మక దాడులను ఖండిస్తూ ఒక శక్తివంతమైన కరపత్రాన్ని ఆంగ్లంలో రాశాడు. "తలలు పగుల గొడుతున్నారు, ఎముకలు ముక్కలుగా విరగ్గొడుతున్నారు, అన్నామలై విశ్వవిద్యాలయంలో రక్తపు నది ప్రవహిస్తున్నది" అని...నాటి దారుణ దృశ్యాన్ని విస్తృతంగా పంపిణీ జరిగిన ఆ కరపత్రంలో శంకరన్ పేర్కొన్నాడు. వార్షిక పరీక్షలకు కేవలం 15 రోజుల ముందు పోలీసులు శంకరయ్యను అరెస్ట్ చేసి, జైలుకు పంపారు. పద్దెనిమి నెలల తర్వాత మాత్రమే ఆయనను విడుదల చేశారు.

శతాబ్దాల తరువాత ఆయనను ఈ ప్రశ్నను అడిగాను: "మీరు న్యాయవాది అవ్వాలని మీ నాన్నగారు కోరుకున్నారు. ఫైనల్ పరీక్షలకు కేవలం పక్షం రోజుల ముందే మీరు అరెస్ట్ అయ్యారు. అంటే మీరు మీ చదువు కొనసాగించరు, లా డిగ్రీ సాధించరు, న్యాయవాది అవ్వరని అర్థం. ప్రభుత్వం మిమ్మల్ని ఎప్పుడు విడుదల చేస్తుందో స్పష్టంగా తెలియదు. అలాంటి పరిస్థితుల్లో, పోలీసులు మిమ్మల్ని అరెస్ట్ చేసినప్పుడు, మీ మానసిక స్థితి ఏంటి?"

ఆయన సమాధానం ఇలా ఉంది: "నేను స్వాతంత్ర్య పోరాటంలో



1650	257	ప్ర.మెరక	6-16	312	గురివిందుల లక్ష్మీ భర్త వెంకట రమణ	అర్.సి.సి. ఇల్లు సిమెంటు రేకుల ఇల్లు	4 వెపుల	యమ్.సత్య నారాయణ	రోడ్డు	ఖాళీ స్థలం	రోడ్డు	సిమెంట్ రేకుల షెడ్డు, బాత్ రూమ్ (సిమెంట్ రేకుల), బోర్ బావి, సిమెంటు రేకుల షెడ్ (పెన్ష)	వేప-1 ఉసిరి-1 కొబ్బరి-1 మామిడి-1
1651	257	ప్ర.మెరక	6-18	313	మీసాల రమణ భర్త సత్యనారాయణ	సిమెంట్ రేకుల ఇల్లు	ఉన్నది	జి.భవాని	రమణ	ఖాళీ స్థలం	రోడ్డు	సిమెంట్ రేకుల షెడ్డు 2 బాత్ రూమ్ , సిమెంటు రేకుల వంటషెడ్	మామిడి-1 నిమ్మ-1 జామ-2
1652	257	ప్ర.మెరక	6-18/1	314	దేవరకోండ గంగ భవాని తండ్రి భాస్కరరావు (లేటు)	సిమెంట్ రేకుల ఇల్లు		ఖాళీ స్థలం site	యమ్.సత్యనారాయణ	డి. రాజేష్	రోడ్డు	బాత్ రూమ్	వేప-1
1653	257	ప్ర.మెరక	6-18/2	315	దేవరకోండ రాజేష్ తండ్రి ధర్మారావు	సిమెంట్ రేకుల ఇల్లుతో కలిపి బాత్‌రూమ్		ఖాళీ స్థలం site	యమ్.సత్యనారాయణ	ఖాళీ స్థలం	డి. గంగభవాని	బోర్ బావి	వేప-1
1654	257	ప్ర.మెరక	4-25/1	316	పోదిలి అంజలి దేవి భర్త శ్రీనివాస్	. . .		యమ్.హను మంతు	ఖాళీ స్థలం site	ఖాళీ స్థలం	రోడ్డు	సిమెంట్ రేకుల షెడ్డు, బోర్ బావి.	
1655	259	ప్ర.మెరక	6-19	317	మేడిది హానుమంతు రావు తండ్రి ముత్యం	సిమెంట్ రేకుల ఇల్లు		ఖాళీ స్థలం site	దారి	ఖాళీ స్థలం	యమ్. లక్ష్మీకాంతం	బాత్ రూమ్,తాటాకుల వంట గది.	నిమ్మ-1 మామిడి-1 జామ-1
1656	259	ప్ర.మెరక	6-22	318	మేడిది సుర్య చంద్ర శేఖర్ తండ్రి శ్రీరంగ నాయకులు	సిమెంటు రేకుల ఇల్లు		మెడిది హనుమంతు	యమ్.సత్యవతి	ఖాళీ స్థలం	రోడ్డు	..	కొబ్బరి-1

మిగతా 24 లో...

23 తరువాయి...

1657	259	ప్ర.మెరక	6-20	319	మేడిది సత్యవతి భర్త వీరాంజనేయులు	సిమెంట్ రేకుల ఇల్లు	2 వైపుల	మెడిది సూర్యచంద్ర శేఖర్	యమ్.శేఖర్	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్, వంట షెడ్డు	వేప-1
1658	259	ప్ర.మెరక	6-21	320	మేడిది సుర్య చంద్ర శేఖర్ తండ్రి శ్రీరంగ నాయకులు	పెంకుటిల్లు	3 వైపుల	మెడిది సత్యనారాయణ	మెడిది సత్యవతి	ఖాళి స్థలం	రోడ్డు	సిమెంట్ రేకుల షెడ్డు 2, ఆర్.సి.సి బాత్ రూమ్, వంట గది	
1659	259	ప్ర.మెరక	6-24	321	మేడిది సత్యనారాయణమ్మ భర్త శ్రీమన్నారాయణ	సిమెంట్ రేకుల ఇల్లు		అ కులవిజయ లక్ష్మీ	మెడిది శేఖర్	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్	వేప-1
1660	259	ప్ర.మెరక	6-25	322	ఆకుల విజయలక్ష్మీ భర్త శ్రీరామకృష్ణ	ఆర్.సి.సి ఇల్లు , సిమెంటు రేకుల ఇల్లు	4 వైపుల	రోడ్డు	మెడిది సత్యనారాయణ	రాజిని	రోడ్డు	బాత్ రూమ్ ,షెడ్డు -3 బోర్‌బావి ,	
1661	259	ప్ర.మెరక	6-31	323	ధనసిరి రజిని భర్త శ్రీనివాస్	ఆర్.సి.సి బిల్డింగ్ తో కలిపి బాత్‌రూమ్	2 వైపుల	ఖాళి స్థలం	ఖాళి స్థలం	విజయ సాదన స్కూల్	విజయలక్ష్మీ హాస్	షెడ్డు 2	కానుగ-1
1662	259	ప్ర.మెరక	6-27	324	దనసరి రజిని భర్త శ్రీనివాస్ విజయ్ సాదన హెస్కూల్ (పైవేట్)	సిమెంట్ రేకుల షెడ్స్-5		ప్ర. స్కూల్	ఖాళి స్థలం	ఖాళి స్థలం	దానసిరిరాజిని	బాత్ రూమ్‌లు- 5, సిమెంటు రేకుల షెడ్స్-8 (25) గదులు, సిమెంటు రేకుల షెడ్స్-2 బాత్‌రూమ్‌లు, (23) బోరు బావులు-2	తుమ్మ-1 కానుగ-11 వెదురు-1 ఉసిరి-2, వేప-5 తాటి-1, రేగు-2 మామిడి-2 కొబ్బరి-2 జామ-10 నిమ్మ-1 పనస-1 మునగ-2 నిమ్మ-2
1663	259	ప్ర.మెరక	6-31/1	325	కయ్యల అనుష భర్త బాలాకృష్ణ	సిమెంట్ రేకుల ఇల్లు		ఉప్పర్లపాటిలక్ష్మణారావు	రోడ్డు	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్‌లు- 2, షెడ్డు -2,	
1664	259	ప్ర.మెరక		326	ఉప్పలపాటి లక్ష్మణరావు తండ్రి సుబ్బరాజు	ఆర్.సి.సి బిల్డింగ్ (జాయింట్) సిమెంటు రేకుల ఇల్లు	ఒక వైపు	వెంకటనాగ ప్రసాద్	కోయ్యల అనుష	ఖాళి స్థలం	రోడ్డు	సిమెంట్ రేకుల షెడ్డు -2 గదులు, ఆర్‌సిసి బాత్‌రూమ్, సిమెంటు రేకుల బాత్‌రూమ్, వాటర్ ట్యాంకు	మామిడి-2 నిమ్మ-1 జామ-1
1665	259	ప్ర.మెరక	6-34	327	గడ్డిపాటి వెంకట నాగ ప్రసాద్ తండ్రి సుబ్రమణ్యేశ్వరరావు	పెంకుటిల్లు	ఉన్నది	జి. శేషగిరి	యు. లక్ష్మణరావు	ఖాళి స్థలం	రోడ్డు	సిమెంట్ రేకుల షెడ్డు, బాత్ రూమ్‌లు- 2	వేప-1 జామ-3 మామిడి-3
1666	259	ప్ర.మెరక	3-36	328	గడ్డిపాటి శేషగిరి రావు తండ్రి వెంకయ్య	సిమెంట్ రేకుల ఇల్లు	2 వైపుల		జి.సుబ్రమణేశ్వర రావు	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్‌లు- 2	టేకు-2 జామాయిల్-1 మామిడి-1 కొబ్బరి-1
1667	259	ప్ర.మెరక	6-37	329	గడ్డిపాటి షణ్ముఖరావు తండ్రి వెంకయ్య	పెంకుటిల్లు		జి.మధుసుధన రావు	జి. శేషారావు	ఖాళి స్థలం	రోడ్డు	స్టోర్ రూమ్, బాత్ రూమ్	వేప-1 జామాయిల్ మామిడి-3 జామ-2 నిమ్మ-1
1668	259	ప్ర.మెరక	3-34/1	330	గడ్డిపాటి మధుసుధన్ రావు తండ్రి వెంకయ్య	సిమెంట్ రేకుల ఇల్లు		రోడ్డు	షన్ముఖ్‌రావు	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్	చింత-1 మామిడి-3 జామ-1
1669	260	ప్ర.మెరక	..	331	ప్రభుత్వ పాఠశాల	జెడ్.పి.హెచ్.యస్ స్కూల్, ఆర్.సి.సి బిల్డింగ్ -7	4 వైపుల	దారి	విజయ సాధన స్కూల్	ఖాళి స్థలం	ఖాళి స్థలం	బాత్ రూమ్ , సిమెంట్ రేకుల షెడ్డు	
1670	260	ప్ర.మెరక	6-39	332	కోయ్యల నాగమణి భర్త వెంకటేశ్వరరావు	సిమెంట్ రేకుల ఇల్లు	ఒక వైపు	ఖాళి స్థలం	రోడ్డు	ఖాళి స్థలం	గడ్డం ముత్యాలు	బాత్ రూమ్ , సిమెంట్ రేకుల షెడ్డులు-2	మామిడి-3 నిమ్మ-2 నిమ్మ-1 జామ-2
1671	260	ప్ర.మెరక	6-41	333	గడ్డం ముత్యాలరావు తండ్రి రాము	తాటాకుల ఇల్లు		ఖాళి స్థలం	రోడ్డు	కోట్ల గంధీ	దారి	బాత్ రూమ్	
1672	260	ప్ర.మెరక	6-42	334	కోట్ల గాంధీ తండ్రి వెంకటేశ్వర్లు	సిమెంట్ రేకుల ఇల్లు		ఖాళి స్థలం	రోడ్డు	గద్దెం ముత్యాలరావు	పునుగుపాటి శాంతమ్మ	బాత్ రూమ్	
1673	260	ప్ర.మెరక	6-43	335	పునుగుపాటి సీతమ్మ తండ్రి వెంకటేశ్వర్లు	సిమెంట్ రేకుల ఇల్లు		ముత్యాల పోశయ్య	రోడ్డు	కోట్ల గంధీ	దారి	బాత్ రూమ్ , సిమెంట్ రేకుల షెడ్డు.	కానుగ-1
1674	260	ప్ర.మెరక	6-59	336	ముత్యాల పోశయ్య తండ్రి నారాయణ	సిమెంట్ రేకుల ఇల్లు		ఖాళి స్థలం	ఖాళి స్థలం	ఖాళి స్థలం	ఖాళి స్థలం	బాత్ రూమ్ ,సిమెంట్ రేకుల షెడ్డు.	తాటి-2
1675	260	ప్ర.మెరక	5-985	337	గడ్డం పేరమ్మ భర్త భూషణం	సిమెంట్ రేకుల ఇల్లు		ఖాళి స్థలం	జి.సత్యవతి	దారి	పి. వరలక్ష్మీ	. . .	
1676	260	ప్ర.మెరక	6-44	338	గడ్డం సత్యవతి భర్త రమణమూర్తి	ఆర్.సి.సి బిల్డింగ్	ఒక వైపు	జి. ప్రేమమ్	సి.సి రోడ్డు	దారి	బి.సమత	బాత్ రూమ్ , సిమెంట్ రేకుల షెడ్డు.	టేకు-1 మామిడి-2 నిమ్మ-1 నిమ్మ-1
1677	260	ప్ర.మెరక	6-45/1	339	భీమ సత్యవతి భర్త రామచంద్రమూర్తి	సిమెంట్ రేకుల ఇల్లు	3 వైపుల	ఖాళి స్థలం	సి.సి రోడ్డు	జి. సత్యవతి	జి.చిన్నకేశవులు	బాత్ రూమ్ , సిమెంట్ రేకుల షెడ్డులు-2	
1678	260	ప్ర.మెరక	6-45	340	గెద్దం చెన్నకెశవరావు తండ్రి ముత్తయ్య	తాటాకుల ఇల్లు		ఖాళి స్థలం	సి.సి రోడ్డు	సత్యవతి	జి. గంగరావు	తాటాకుల వంట గది, బాత్ రూమ్ .	జామ-1 నిమ్మ-1
1679	260	ప్ర.మెరక	6-47	341	గెద్దం రంగారావు తండ్రి రాములు	సిమెంట్ రేకుల ఇల్లు		జి.రాములు	సి.సి రోడ్డు	జి.చిన్నకేశవ రావు	రోడ్డు	బాత్ రూమ్	
1680	260	ప్ర.మెరక	6-46	342	గెద్దం రాములు తండ్రి ముత్తయ్య	సిమెంట్ రేకుల ఇల్లు		పి.వరలక్ష్మీ	జి.గంగరావు	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్ , సిమెంట్ రేకుల షెడ్డులు-2	
1681	260	ప్ర.మెరక	6-48	343	పింజర్ల వరలక్ష్మీ భర్త రామూర్తి	పెంకుటిల్లు		సిహచ్‌విజయ మెహన్‌రావు	జి. రాములు	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్	జామ-1
1682	260	ప్ర.మెరక	6-49	344	చదలవడ విజయమెహన్‌రావు తండ్రి వరదరామానుజయ	ఆర్.సి.సి బిల్డింగ్	4 వైపుల	వై.శైలాజ	పి. వీరలక్ష్మీ	సి.హెచ్ కాంతరావు	రోడ్డు	బాత్ రూమ్	
1683	260	ప్ర.మెరక	6-50	345	చదలవడ కాంతరావు తండ్రి విజయ మోహన్‌రావు	పెంకుటిల్లు		వై.శైలాజ	పి. వీరలక్ష్మీ	ఖాళి స్థలం	రోడ్డు	. . .	
1684	260	ప్ర.మెరక	6-51	346	యల్ల శైలజ భర్త నాగమల్లేశ్వరరావు	సిమెంట్ రేకుల ఇల్లు	ఒక వైపు	టి.పుల్లయ్య	సి.హెచ్ కాంతరావు	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్	
1685	260	ప్ర.మెరక	6-53	347	తలగాని రాము తండ్రి పుల్లయ్య	తాటాకుల ఇల్లు		యస్.వెంకట సత్యనారాయణ	వై.శైలైజా	ఖాళి స్థలం	టి .పుల్లయ్య	బాత్ రూమ్	చింత-1 జామ-1
1686	260	ప్ర.మెరక	6-52	348	తాలగాని పుల్లయ్య వెంకన్న	సిమెంట్ రేకుల ఇల్లు		యస్.వెంకట సత్యనారాయణ	వై.శైలైజా	టి.రాము	రోడ్డు	. . .	
1687	260	ప్ర.మెరక	6-54	349	శ్రీరాములు వెంకట సత్యనారాయణ తండ్రి కృష్ణామాచారి	సిమెంట్ రేకుల ఇల్లు		ధనలక్ష్మీ	టి.రాము	ఖాళి స్థలం	రోడ్డు	సిమెంట్ రేకుల షెడ్డు బాత్ రూమ్	మామిడి-2
1688	260	ప్ర.మెరక	6-55	350	గుగ్గిల ధనలక్ష్మీ భర్త సత్యనారాయణ	సిమెంట్ రేకుల ఇల్లు		యస్.అనసూయ	యస్. వెంకట సత్యనారాయణ	ఖాళి స్థలం	రోడ్డు	. . .	
1689	260	ప్ర.మెరక	6-56	351	శ్రీరాములు అనసూయ భర్త కృష్ణమాచార్య	సిమెంట్ రేకుల ఇల్లు	ఒక వైపు	వై.మహేష్	జి. ధనలక్ష్మీ	ఖాళి స్థలం	రోడ్డు	. . .	మామిడి-1
1690	260	ప్ర.మెరక	6-57	352	యళ్ల మహేష్ తండ్రి అనందరావు	సిమెంట్ రేకుల ఇల్లు	4 వైపుల	చర్చి	యస్.అనసూయ	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్ , తాటాకుల పశువుల పాక, సిమెంట్ రేకుల షాపు, సిమెంటు రేకుల షెడ్	రేగు-1 ఉసిరి-1 వేప-1
1691	260	ప్ర.మెరక	..	353	సి.యస్. ఐ చర్చ్	చర్చ్	ఉన్నది	డి.రాజ్యం	వై.మహేష్	ఖాళస్థలం	రోడ్డు	..	
1692	260	ప్ర.మెరక	6-58	354	దాసరి రాజ్యం భర్త రామయ్య	తాటాకుల ఇల్లు	..	రోడ్	చర్చి	ఖాళి స్థలం	రోడ్డు	బాత్ రూమ్	మామిడి-2
1693	260	ప్ర.మెరక	..	355	ఫారెస్టు ఆఫీసు	నిర్మాణంలో ఉన్నది	..	సబరి నది	ఖాళి స్థలం	ఖాళి స్థలం	రోడ్డు	..	

1694	44	పట్టా భూమి	8-24.	356	కట్టం బుచ్చమ్మ భర్త తమ్మయ్య	ప్లాస్టిక్ కవర్ కప్పిన ఇల్లు	..	పాదం వెంకటేశ్వర్లు	కట్టం రాము	యర్రల నరసింహారావు	పోట్ల రావమ్మ	.....	.....
1695	44	పట్టా భూమి	8-6/2.	357	పెంకి నరేష్ తండ్రి నాగేశ్వరరావు	గోడలు లేని తాటాకుల షెడ్	..	ఖాళి స్థలము	ఖాళి స్థలము	రోడ్	ఖాళి స్థలము	.....	.....
1696	44	పట్టా భూమి	7-80.	358	వరాల జగ్గారావు తండ్రి ముత్యాలరావు	తాటాకుల ఇల్లు	..	రోడ్	ఖాళి స్థలము	భీమిసేని రాజారావు	గండికోట ఏడుకొండలు	.....	.....
1697	44	పట్టా భూమి	7-88/1.	359	శ్యామల వీర వెంకట సత్యనారాయణ తండ్రి రాము	బరకం షెడ్	..	రోడ్	రామస్వామి జ్యోతి	బొడ్డు అక్కమ్మ	శ్యామల రామకృష్ణ	.....	.....
1698	44	పట్టా భూమి	7-77/1.	360	సంగం రమేష్ తండ్రి అప్పారావు	ఇనుపరేకుల షెడ్	..	రోడ్	సంగం సరోజిని	ఖాళీ స్థలము	గోళ్ళ రవికిరణ్	.....	.....
1699	45	గ్రామ కంఠం	8-8/1.	361	కారం రాజేశ్వరి తండ్రి గంగయ్య కారం వెంకమ్మ	గోడలు లేని సిమెంటు రేకుల షెడ్	..	పల్లం కిశోర్	కరణం ప్రసాద్ - సతీష్	కణితి ఆదెమ్మ	రోడ్	బాత్ రూమ్	గానుగ-1
1700	45	గ్రామ కంఠం	1-8.	362	పెంకి జగ్గులు తండ్రి అప్పన్న	సిమెంటు రేకుల ఇల్లు	..	మద్దిపాటి సత్య శీల	మచ్చా వినయ్ ప్రసాద్	పెంకి సాయిబాబు	పెంకి రమణ	.....	.....
1701	71	పట్టా భూమి	6-126.	363	యడ్ల సౌదామణి భర్త చిన వీరన్న	సిమెంటు రేకుల ఇల్లు	..	దారి	జక్కుల గంగరాజు	దారి	బుడిపాటి రమణ	.....	.....
1702	72	గ్రామ కంఠం	8-48/3.	364	వల్లల సుధారాణి భర్త సత్యనారాయణ	సిమెంటు రేకుల ఇల్లు	..	యడ్ల గణేష్	ముత్యాలమ్మ గుడి	నీలాపు శ్రీనివాసరావు	యజ్న్ా కొండయ్య	బాత్ రూమ్	.....
1703	72	గ్రామ కంఠం	6-134/3.	365	మహమద్ అక్బర్ షరీఫ్ తండ్రి అజ్గర్ షరీఫ్	సిమెంటు రేకుల ఇల్లు	..	యడ్ల వెంకటస్వామి	చిట్టెటి బాబూరావు	ఖాళి స్థలము	దున్న రాజు	.....	.....
1704	72	గ్రామ కంఠం	--	366	బొడ్డు గట్టయ్య	కూలిపోయిన తాటాకుల ఇల్లు	..	వాటర్ టాంక్	ఖాళి స్థలము	ఖాళి స్థలము	ఖాళి స్థలము	.....	.....
1705	73	గ్రామ కంఠం	6-113/1.	367	బుడిపిటి శివకృష్ణ తండ్రి బాబూరావు	గోడలు లేని సిమెంటు రేకుల షెడ్	..	కణితి పుష్పా వతి	బుడిపాటి బాబురావు	పల్లంటి రాణి	గోలి సావిత్రి	.....	.....
1706	73	గ్రామ కంఠం	6-118.	368	పల్లంటి రాణి భర్త వెంకటనరసయ్య	తాటాకుల ఇల్లు	..	కణితి పుష్పా వతి	కుళాయి స్థలము	రోడ్	బుడిపాటి బాబురావు	.....	.....
1707	83	గ్రామ కంఠం	8-99/1.	369	కల్లం సాయిచంద్రరావు తండ్రి చంద్రయ్య	గోడలు లేని ఇనుప రేకుల ఇల్లు	..	రోడ్	ఆవుల శ్రీనివాసరావు	కల్లం వీరంజనేయులు	దారి	.....	.....
1708	83	గ్రామ కంఠం	--	370	కట్టం బూబమ్మ భర్త శ్రీనివాసరావు (బండారు నరసింహరావు)	ఇనుప రేకుల ఇల్లు	..	బండారు వంశీ కృష్ణ	కళ్ళం నాగులమ్మ	ఖాళి స్థలము	రోడ్	.....	.....
1709	83	గ్రామ కంఠం	8-105.	371	కల్లం నాగులమ్మ భర్త చంద్రయ్య	ఇనుప రేకుల ఇల్లు	..	కట్టం బూబమ్మ	సంగం భిక్షం	కల్లం వీరంజనేయులు	రోడ్	.....	.....
1710	251	జి.మెరక	--	372	మిరియాల అరుణ భర్త వీరభద్రం	తాటాకుల ఇల్లు	..	బత్తుల నరసింహారావు	దారా జయమ్మ	ఖాళి స్థలము	ఖాళి స్థలము	.....	.....
1711	253	పట్టా భూమి	--	373	కదల వెంకటలక్ష్మీ భర్త వెంకటరెడ్డి	గోడలు లేని సిమెంటు రేకుల షెడ్	..	ఖాళి స్థలము	కదల సీతారత్నం	ఖాళి స్థలము	ఖాళి స్థలము	.....	.....
1712	254	గ్రామ కంఠం	4-89.	374	గద్దల శ్రీకాంత్ తండ్రి నాగేశ్వరరావు	గోడలు లేని సిమెంటు రేకుల షెడ్	..	పుట్టి రమణమ్మ - వెంకట నరసయ్య	ఖాళి స్థలము	గుంతక విల్సన్	గద్దల నాగేశ్వరరావు	.....	.....
1713	254	గ్రామ కంఠం	2-174/3.	375	సయ్యద్ అఫ్రూజడ్‌బేగం భర్త హరీఫ్	ఇనుప రేకుల ఇల్లు	..	సయ్యద్ షఫీ ఉల్లా	ఖాళీ స్థలము	సయ్యద్ సుకూర్	గడ్డం శ్రీను	.....	.....
1714	255	గ్రామ కంఠం	3-66.	376	గద్దల వెంకటలక్ష్మీ భర్త రాజు	ఇనుప రేకుల ఇల్లు	..	కాకాని బాబు	గద్దల భుపతిరావు	గడ్డం రమణయ్య - లక్ష్మణరావు	దారి	.....	జామ-1
1715	255	గ్రామ కంఠం	--	377	పాగా బజారు తండ్రి సత్యం	కూలిపోయిన తాటాకుల ఇల్లు	..	బండి సత్యం	దారి	గోదావరి నది	కుంతీదేవి గుడి	.....	.....
1716	264	జి.మెరక	3-70/2.	378	పకనాటి వెంకటేశ్వర్లు తండ్రి భీమయ్య	ఇనుప రేకుల ఇల్లు	..	ఖాళి స్థలము	దారి	జుజ్జుల శ్రీనివాసు	వై.రామారావు	.....	.....
1717	264	జి.మెరక	1-217.	379	వేమన లావణ్య భర్త రాజు	గోడలు లేని సిమెంటు రేకుల షెడ్	..	బల్లా వెంకట రత్నం	బెల్లం వెంకట నాగ లక్ష్మిరామ్	బెలంకొండ తులసి రామ్	అల్లంకి ధర్మరాజు	.....	.....
1718	264	జి.మెరక	2-2/1.	380	బల్లా వెంకటేశ్వర్లు తండ్రి సాంబశివరావు	గోడలు లేని సిమెంటు రేకుల షెడ్	..	రోడ్	ఖాళి స్థలము	టక్కా సత్యవతి	అల్లంకి అశోక్ కుమార్	.....	.....
1719	264	జి.మెరక	3-84/12.	381	సారే ఆనంద్ కుమార్ తండ్రి రామకృష్ణ	ఇనుప రేకుల ఇల్లు	..	దారి	రోడ్	మరకం కుసుమ	చుండూరి సాయి బాబు	.....	.....
1720	264	జి.మెరక	5-49/1.	382	తాళ్లూరి సబిత భర్త వెంకట లక్ష్మణరావు	పెంకుటిల్లు	..	తాళ్ళూరి వెంకట లక్ష్మణరావు	ఖాళి స్థలము	తాళ్ళూరి ప్రసాద్	తాళ్ళూరి రాజేశ్వరి	.....	.....
1721	264	జి.మెరక	6-69.	383	యర్రనూకల రామారావు తండ్రి చిన్నయ్య	ఇనుప రేకుల ఇల్లు	..	ఖాళి స్థలము	దారి	పి. వెంకటేశ్వర్లు	మండా దుర్గా ప్రసాద్	.....	.....
1722	264	జి.మెరక	--	384	గుదే సత్యనారాయణ తండ్రి వెంకటస్వామి	సిమెంటు రేకుల ఇల్లు	..	గుదే సింహాచలం	పోనుగుపాటి భరత్ మూర్తి	పోనుగుపాటి వెంకటస్వామి	రోడ్	.....	.....
1723	264	జి.మెరక	5-64.	385	బంబోతుల వెంకటరమణ రావు తండ్రి గరుడాచలం	తాటాకుల ఇల్లు	..	చలపాక సత్యవతి	గడ్డం లక్ష్మణరావు	ఖాళి స్థలము	రోడ్	.....	.....
1724	268	జి.మెరక	1-156.	386	సాఖమూరి నాగేంద్రకుమార్ తండ్రి గణపతి	సిమెంటు రేకుల ఇల్లు	..	దారి	ఖాళి స్థలము	రామాలయము	ఖాళి స్థలము	.....	.....
1725	268	జి.మెరక	2-28/1.	387	నరహరశెట్టి రాజేంద్రప్రసాద్ తండ్రి అయోధ్య రామయ్య	ఇనుప రేకుల ఇల్లు	..	జీరు షర్మిళ రెడ్డి	ఖాళి స్థలము	నరహరిసేట్టి గోపాలకృష్ణ	తాళ్లాబత్తుల బ్రాహ్మం	.....	వేప-1
1726	268	జి.మెరక	2-28/3.	388	నరహరశెట్టి వల్లభాయిపటేల్ తండ్రి శనిప్రసాద్‌రెడ్డి	ఇనుప రేకుల ఇల్లు	..	దివ్వెల వెంకటాచారి	ఖాళి స్థలము	గోదావరి నది	నరహరిసేట్టి గోపాలకృష్ణ	.....	.....
1727	268	జి.మెరక	1-178.	389	దిక్కొండ సుశీల భర్త లక్ష్మీనారాయణ	గోడలు లేని సిమెంటు రేకుల షెడ్	..	డీ కొండ వెంకటరమణ	పెదప్రోలు రామా శ్రీనివాస్	మొగజాల సత్యకుమార్	డీ కొండ లక్ష్మీనారాయణ	.....	.....
1728	268	జి.మెరక	2-28/2.	390	నరహరశెట్టి గోపాలకృష్ణ తండ్రి శనిప్రసాద్‌రావు	ఇనుప రేకుల ఇల్లు	..	పిలకా రెడ్డి	ఖాళి స్థలము	నరహరిసేట్టి వల్లభాయ్ పటేల్	నరహరిసేట్టి రాజేంద్రప్రసాద్,	.....	.....
1729	268	జి.మెరక	1-123.	391	బట్టా రాములు (లేటు) తండ్రి కొండయ్య బట్టా శివకృష్ణ తండ్రి రాజేశ్వరరావు	సిమెంటు రేకులు మరియు ఇనుప రేకుల ఇల్లు	..	మునిగేపు నీలకంఠేశ్వర రావు	కూనవరపు లక్ష్మి	పులగంపల్లి కృష్ణ కుమారి	బట్టా లక్ష్మికాంతం	.....	.....
1730	269	జి.మెరక	5-1.6/5.	392	చల్లకొట్టి అప్పల నరసమ్మ భర్త మల్లిఖార్జునరావు	తాటాకుల ఇల్లు	..	నది	చలకోటి వీరభద్రరావు	రోడ్	చలకోటి వీరభద్రరావు	.....	.....

మిగతా 25 లో...

ఆ ముగ్గురు జేబు దొంగలు

- మోడీ, అమిత్‌షా, అదానీపై రాహుల్ తీవ్ర విమర్శలు

భరత్‌పూర్ (రాజస్థాన్): ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ ముగ్గురిని జేబు దొంగలతో పోల్చారు. జేబు దొంగల ముఠా లాగానే ఈ ముగ్గురు కలిసి దేశంలోని ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు.

రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో బుధవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'జేబుదొంగ ఎప్పుడూ ఒంటరిగా రాడు. ముఠాలో ముగ్గురు వ్యక్తులు ఉంటారు. ఒకరు ముందు నుంచి, మరొకరు వెనుక నుంచి వస్తారు. ఇంకొకరు దూరం నుంచి గమనిస్తూ ఉంటారు. వీరిలో మీ దృష్టిని మరల్చడమే మోడీ పని. హిందూ-ముస్లిం, నోట్ల రద్దు, జిఎస్‌టి వంటి అంశాలతో ప్రజల దృష్టి మరుస్తారు. ఇంతలో అదానీ వెనుక నుంచి వచ్చి డబ్బును దోచుకుంటాడు. ఇక పర్యవేక్షించడం అమిత్‌షా పని. అక్కడ జరుగుతున్నది ఎవరికీ తెలియకుండా చూసుకుంటాడు' అని విమర్శించారు.

12 మీటర్ల దూరంలో ..

- తుది దశకు 'ఉత్తరకాశీ' టన్నెల్ ఘటన సహాయక కార్యక్రమాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో టన్నెల్ కూలిపోయిన ప్రమాదం నుంచి కార్మికులను వెలికితీతకు జరుగుతున్న సహాయక కార్యక్రమాలు తది దశకు చేరుకున్నాయి. కేవలం మరోక 12 మీటర్లు డ్రిల్లింగ్ చేస్తే కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకుని రావచ్చునని బుధ వారం సాయంత్రం అధికారులు వెల్లడించారు. అన్ని అనుకూలిస్తే బుధవారం రాత్రికే కార్మికులు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. 'కార్మికు లు 57 మీటర్ల దూరంలో భూగర్భంలో చికుకున్నారని భావిస్తున్నాం. ఇందులో ఇందులో ఇప్పటి వరకూ 45 మీటర్లు డ్రిల్లింగ్ పూర్తి చేశాం. కాబట్టి మరో 12 మీటర్ల దూరం మాత్రమే మిగిలిఉంది' అని ఉత్తరాఖండ్ రోడ్డు రవాణ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. రాష్ట్రంలో ఉత్తరకాశీ జిల్లాలో ఈ నెల 12న నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోయిన సంగతి తెలి సిందే. ఈ సొరంగంలో 41 మంది కార్మికులు వరసగా 11 రోజుల పాటు చిక్కుకుని ఉన్నారు.

14 ప్రాంతాల్లో ఎన్ఐఎ సోదాలు

న్యూఢిల్లీ : పంజాబ్, హర్యానాలోని 14 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియాపై దాడులకు సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఎన్ఐఎ ఈ సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి 19, జులై 2న శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఇండియన్ కాన్సులేట్‌పై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. కార్యాలయంలోకి చొరబడిన దుండగులు కార్యాలయాన్ని ధ్వంసం చేయడంతో పాటు, భవనానికి నిప్పు పెట్టారు. కాన్సులేట్ అధికారులపై దాడికి కూడా యత్నించారు. ఈ దాడుల్లో భాగమైన కొంతమంది వ్యక్తులను ఎన్ఐఎ ఇప్పటికే గుర్తించింది. ఈ దాడుల వెనుక ఉన్న పూర్తి కుట్రను ఛేదించే ప్రయత్నంలోనే బుధవారం ఉదయం రెండు రాష్ట్రాల్లో 14 ప్రాంతాల్లో సోదాలు చేసింది. పంజాబ్‌లోని మోగా, జలంధర్, లూథియానా, గురుదాస్‌పూర్, మొహాలి, పాటియాలా జిల్లాలోనూ, హర్యానాలోని కురుక్షేత్ర, యమునానగర్‌ల్లోనూ ఎన్ఐఎ దాడులు జరిపింది.

దేశం పేరును మాత్రమే మార్చగలరు

- బిజెపిపై ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు

ఈరోడ్ : బిజెపి నాయకులు కేవలం దేశం పేరును మాత్రమే మార్చగలరని, దేశ ప్రజల స్థితిగతులను మార్చలేరని తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఈరోడ్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "2014లో ఎన్నికల ప్రచారం సందర్భంగా నరేంద్ర మోడీ మాట్లాడుతూ, నల్ల ధనాన్ని పూర్తిగా నిర్మూలన చేస్తానని చెప్పారు. కానీ చేయలేదు. 2020కల్లా భారత్‌ను అగ్రరాజ్యంగా చేస్తానని ప్రకటించారు. కానీ ఇప్పుడు 2047కల్లా అగ్రరాజ్యంగా మారుతుందని చెబుతున్నారు. భారత్‌ను మారుస్తానంటూ చెప్పారు. కానీ ఆయన కేవలం పేరును మాత్రమే మారుస్తున్నారు. 2024 ఎన్నికల్లో వీటన్నింటికీ మేం సమాధానం ఇవ్వాల్సి వుంది." అని స్టాలిన్ పేర్కొన్నారు. బానిస పార్టీలన్నింటికీ బిజెపి మాస్టర్ అని వ్యాఖ్యానించారు. 2021లో తమిళనాడులో మేం బానిస పార్టీని ఓడించామని, అలాగే బిజెపిని కూడా పార్లమెంటరీ ఎన్నికల్లో ఓడిస్తామన్నారు. అన్నాడిఎంకెను ప్రస్తావిస్తూ, తమిళనాడు హక్కులన్నింటినీ అన్నాడిఎంకె ప్రభుత్వం త్యాగం చేసిందన్నారు. నీట్‌ను ఒకప్పుడు అనుమతించారు. కానీ జయలలిత హయాంలో నీట్ రాష్ట్రంలో అమలు కాలేదు. ఆమె చనిపోయిన తర్వాత అన్నాడిఎంకె అనుమతించిందన్నారు.

విజయమే లక్ష్యంగా..

రాజస్థాన్‌లో సిపిఎం ప్రచారం



ఏచూరి, బృంద, సుభాషిణి ప్రసంగాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సిపిఎం ప్రచారం విస్తృతంగా సాగుతోంది. వివిధ నియోజకవర్గాల్లో బుధవారం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బృంద కరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు విజూ కృష్ణన్ విస్తృత ప్రచారం నిర్వహించారు. దాతరామ్‌ఘడ్ అసెంబ్లీ అభ్యర్థి అమ్రారామ్‌కు మద్దతుగా డాటాలో నిర్వహించిన భారీ విజయ సంకల్ప సభలో సీతారాం ఏచూరి ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం అమృత్‌కల్ గురించి మాట్లాడుతోందని, అయితే అమృతం పోయిందని అన్నారు. దేశంలోని రైతులు, కూలీలు, విద్యార్థి, యువకులు, దళితులు, మైనారిటీలు, మహిళల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. అమ్రారామ్ అసెంబ్లీకి వెళితే దాతరామ్‌ఘడ్‌లోని సామాన్య ప్రజానీకానికి నిజమైన అమృతాన్ని అందిస్తారని అన్నారు. అదే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచిన తర్వాత దాతరామ్‌ఘడ్ గ్రామాల్లో తాగునీరు లేదని, ప్రభుత్వ కళాశాల లేదని అన్నారు. ఆ విధంగా కాంగ్రెస్, బీజేపీలు దేశ ఆస్తులను దోచుకుంటున్నాయని, మన రైల్వేలు, బ్యాంకులు, బీమా, విమానయాన సంస్థలు, పాఠశాలలు, ఆసుపత్రులు దోచుకుంటున్నారని విమర్శించారు. మీ ప్రతినిధిగా అమ్రారామ్ ఉ ఎన్నుకోవాలని పిలుపు ఇచ్చారు. నేడు దేశం చాలా సంక్షోభంలో ఉందన్నారు. ఆ రకంగా చూస్తే రాజస్థాన్‌లో జరిగే ఈ ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ ఎన్నికల్లో రాజస్థాన్ ప్రజలు సీపీఎం అభ్యర్థులను గెలుపిస్తారని తాను నమ్ముతున్నానని అన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రముఖ రైతు నాయకుడు, సీపీఎం అభ్యర్థి అమ్రారామ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఎనిమిది సార్లు కాంగ్రెస్, ఐదుసార్లు బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారని, అయితే ప్రజలు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. కేంద్రంలో బీజేపీ జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ కూడా ఇదే ప్రాంతంలో పుట్టాడని, కానీ బిజెపి నీళ్లను అందించలేకపోయిందని విమర్శించారు. 2008లో తనకు అవకాశం ఇచ్చారని, కోట్లాది రూపాయల ప్రణాళికను ఆమోదించి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. నేడు దంతా, పల్సానా పెద్ద పట్టణాలని, కానీ కాలేజ్ లేకపోవడంతో రైతు కూలీల పిల్లలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని అన్నారు.

కాంగ్రెస్ హయాంలో కుండ నీళ్ల కోసం వెళ్లిన మూడో తరగతి దళిత విద్యార్థినీ ఇంద్ర మేఘ్వాల్ ను మీసాలు మెలిసి చంపేశారని, అందుకే సామాన్య ప్రజానీకం, దళితులు గౌరవం కల్పించేందుకు మీ ప్రతినిధిగా అమ్రారామ్ ను ఎన్నుకోవాలని ధోడ్ మాజీ ఎమ్మెల్యే పేమారామ్ కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కిషన్ పారిక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్ లీక్ ప్రభుత్వమన్నారు. ఈ సభలో సీపీఎం హర్యానా రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మాలిక్, మాజీ కార్యదర్శి ఇంద్రజిత్ సింగ్, ఐద్వా నేత ఆశా శర్మ, నేతలు సుభాష్ జాఖర్, భగవాన్ సహాయ్ ధాకా, కుందన్ వర్మ, ఘాసిరామ్ చౌదరి, తారా ధయాల్, సాబీర్ అలీ తదితరులు ప్రసంగించారు.అంతకుముందు సికార్ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి ఉస్మాన్ ఖాన్‌కు మద్దతుగా జరిగిన భారీ సభను ఉద్దేశించి ఏచూరి ప్రసంగించారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి కిషన్ పారిక్ తదితరులు పాల్గొన్నారు. రైసింగ్‌నగర్ నియోజకవర్గంలోని ముక్లావలో సీపీఎం అభ్యర్థి సయోపాత్రంకు మద్దతుగా జరిగిన సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృంద కరత్ మాట్లాడారు. సయోపాత్రంకు అపారమైన మద్దతు లభిస్తోంది. అలాగే హనుమాన్‌ఘర్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి కామ్రేడ్ మంగేజ్ చౌదరికి మద్దతుగా నోహర్ లో ప్రజా విప్లవ ర్యాలీ జరిగింది. బృంద కరత్ మాట్లాడుతూ, సామాన్యుల బలాన్ని మరింత బలోపేతం చేయడానికి, సామాన్య ప్రజల కోసం పోరాడటానికి మంగేజ్‌ను అసెంబ్లీకి పంపాలని కోరారు. అప్పుడే మరింత గట్టిగా పోరాడవచ్చని అన్నారు. లద్నూన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తెలి రోడ్డులో జరిగిన సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు విజూ కృష్ణన్ మాట్లాడారు.

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2023

తెలంగాణలో రాబోయేది బిఎస్‌పి సర్కారే

- ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు మాయావతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రాబోయేది తమ సర్కారేనని బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) జాతీయ అధ్యక్షులు మాయావతి ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట గాంధీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఎస్‌పి అభ్యర్థి వట్టెజానయ్య యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం జరిగిన బహిరంగసభను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. దేశంలో సంపన్న వర్గాల కోసం కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పనిచేస్తున్నాయని, కానీ బిఎస్‌పి మాత్రం బహుజన వర్గాల కోసం ప్రజల విరాళాలతో నడుపబడుతున్న ఏకైక పార్టీ అని తెలిపారు. సబ్బండవర్గాలకు అండగా ఉండే బిఎస్‌పి.. ఈ ఎన్నికల్లో సత్తా చాటుతుందని తెలిపారు. తెలంగాణలో అత్యంత అవినీతి ప్రభుత్వం ఉందని, శాంతి భద్రతలు క్షీణించాయని, ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలు పట్టవని.. భ్రష్టాచార్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించాలని కోరారు. ఉత్తరప్రదేశ్ మాదిరి తెలంగాణలో కూడా బహుజన సమాజ్ పార్టీని ఆదరించాలని కోరారు. కొన్ని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలు ప్రకటించినా.. వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళా కోటాలో ఎస్‌సి, ఎస్‌టి కోటా ఉండాలని.. మొదటి నుంచి బిఎస్‌పి ఈ విషయం చెప్తోందన్నారు. ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో కంటే ఎక్కువ స్థానాలను తమ పార్టీ గెలవబోతోందని అన్నారు. జానయ్య ఏర్పాటు చేసిన సభను విఫలం చేయడానికి మంత్రి, పోలీసులు ప్రయత్నాలు చేసినా ప్రజలు భారీగా తరలివచ్చారన్నారు. బిసి వాదం ఎత్తుకున్నందుకు జానయ్యపై మంత్రి జగదీశ్‌రెడ్డి 70కి పైగా కేసులు పెట్టించారని విమర్శించారు. అభ్యర్థి వట్టెజానయ్య యాదవ్ మాట్లాడుతూ.. చావు నోట్లోకి వెళ్లి ప్రజల ఆశీర్వాదంతో తిరిగి వచ్చానని చెప్పారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అగ్ర వర్ణాల అభ్యర్థులపై తన గెలుపు ఖాయమన్నారు.

తాత్కాలిక కాల్పుల విరమణ

- బందీల పరస్పర మార్పిడి
- ఖతార్ మధ్యవర్తిత్వంలో కుదిరిన డీల్
- నాలుగు రోజుల తరువాత మళ్లీ యుద్ధం: నెతన్యాహు



గాజా/ జెరూసలెం : గాజాపై దాడులను వెంటనే ఆపాలంటూ ప్రపంచవ్యాపితంగా పెద్దయెత్తున ర్యాలీలు, ప్రదర్శనలు రోజురోజుకీ ఉధృతమవుతున్న నేపథ్యంలో ఇజ్రాయిల్ దిగివచ్చి తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించింది. తమ వద్ద ఉన్న బందీలను మార్పిడి చేసుకునేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. ఖతార్ మధ్యవర్తిత్వంలో ఇజ్రాయిల్, అమెరికా అధికారులకు, హమాస్ ప్రభుత్వానికి మధ్య బుధవారం ఈ మేరకు డీల్ కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం నాలుగు రోజుల పాటు కాల్పుల విరమణ ఉంటుంది. అమెరికా, తన మిత్రపక్షమైన ఇజ్రాయిల్ దీనిని ఒక చిన్న ఆటవిడుపుగా అభివర్ణించాయి. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ 'మేము యుద్ధంలో ఉన్నాం. మాలక్ష్యాలన్నీ నెరవేరేంతవరకు యుద్ధాన్ని కొనసాగిస్తాం. హమాస్‌ను నాశనం చేయడం, బందీలందరినీ తమకు అప్పగించడం, ఇజ్రాయిల్‌కు ముప్పు కలిగించేవారెవరూ గాజాలో లేకుండా చేయడం ఇవే ఆ లక్ష్యాలు ' అని చెప్పారు. గాజాలో ప్రజలకు నీరు, ఆహారం, ఇంధనం, మందులు వంటి అత్యవసరాలను నిలిపేసి వారిని అశక్తులను చేయడం, మరో వైపు నుంచి టన్నుల కొద్దీ బాంబులను కురిపించడం ద్వారా జాతి నిర్మూలన చేయడమే నెతన్యాహు అసలు లక్ష్యం. గత ఆరు వారాలుగా సాగిస్తున్న మారణహోమంలో 14వేల మంది అమాయక పాలస్తీనా పౌరులు చనిపోయారు. మిగిలిన వారిని బలవంతంగా బయటకు వెళ్లగొడుతోంది. ఈ నాలుగు రోజుల కాల్పుల విరమణ గడువును ఇజ్రాయిల్ తన సైనిక శక్తిని మరింతగా కూడదీసుకుని గాజాపైన, ఇరాన్, సిరియా, లెబనాన్‌లపై యుద్ధానికి తెగబడాలని చూస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి లేదా గురువారం తెల్లవారు జాము నుండి కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం హమస్ చేతిలో బందీలుగా ఉన్న వారిలో 50-100 మందిని విడుదల చేస్తుంది. వీరిలో సైనికులు మినహా ఇజ్రాయిలీ పౌరులు, ఇతర దేశాలకు చెందిన వారు ఉన్నారు.

దీనికి ప్రతిగా తమ జైళ్లలో మగ్గుతున్న 150మంది ఖైదీలను ఇజ్రాయిల్ విడుదల చేయాల్సి వుంటుందని తెలిపింది. బందీల్లో 33మంది మహిళలు, 123మంది మైనర్లు వున్నారు. వీరందరూ 2021 నుండి నిర్బంధంలో వున్నారు. కాల్పుల విరమణ ఒప్పంద గడువును పెంచాలని సౌదీ అరేబియా, ఈజిప్ట్, జోర్డాన్‌ల విదేశాంగ మంత్రులు కోరారు. లండన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వీరు, ఈ కాల్పుల విరమణ ఒప్పందం అంతిమంగా రెండు దేశాల ఏర్పాటు దిశగా చర్చల పునరుద్ధరణకు దారి తీయగలదన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

ఆస్పత్రులు, శరణార్ధ శిబిరాలపై కొనసాగుతున్న దాడులు

గాజాలో ఆస్పత్రులు, శరణార్ధ శిబిరాలపై మంగళవారం రాత్రి బుధవారం ఉదయం కూడా జరిగిన దాడుల్లో దాదాపు వందమందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. వీరందరినీ సామూహిక ఖననం చేశారు. ఆస్పత్రుల్లో, చుట్టుపక్కలా పరిస్థితులు భయంకరంగా వున్నాయని కమల్ అద్వాన్ ఆస్పత్రి డైరెక్టర్ తెలిపారు. తమ ఆస్పత్రికి గత రాత్రి నుండి 60వరకు మృత దేహాలు, వెయ్యి మందికి పైగా గాయపడిన వారు వచ్చారని చెప్పారు. వైద్య బృందాలకు ఒక్క క్షణం కూడా విశ్రాంతి దొరకడం లేదని, ఒక్క చుక్క కూడా ఇంధనం లేకపోవడంతో చేతుల్లో టార్చిలైట్లు పట్టుకుని చీకట్లోనే ఆపరేషన్లు చేస్తున్నారని చెప్పారు. ఆస్పత్రికి చుట్టుపక్కలా బాంబు దాడులతో భయానకమైన పరిస్థితి నెలకొందని

సరైన దిశగా కీలక చర్య

కాల్పుల విరమణ సరైన దిశలో తీసుకున్న ఒక కీలకమైన చర్యగా ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది. అయితే ఇంకా చేయాల్సింది చాలా వుందని పేర్కొంది. కాల్పులు విరమించిన ఈ సమయాన్ని బందీల విడుదలకు, గాజాలోని పాలస్తీనియన్ల దుస్థితిని తప్పించేలా వారి అవసరాలు తీర్చేందుకు ఉపయోగించాలని మధ్య ప్రాచ్య శాంతి ప్రక్రియకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక కోఆర్డినేటర్ టార్ వెనెస్‌లాండ్ సూచించారు.

అంతర్జాతీయ సమాజం స్పందన

మానవతా సంక్షోభాన్ని తగ్గించేందుకు ఇది దోహదపడుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ వ్యాఖ్యానించారు. ఇదొక కీలకమైన చర్య అని బ్రిటన్ వ్యాఖ్యానించింది. చాలా కాలం తర్వాత విన్న మొదటి మంచి వార్తగా రష్యా పేర్కొంది. గాజాలో మానవతా సాయం పెంచడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్ వ్యాఖ్యానించారు.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తంగా నలుగురు భద్రతా సిబ్బంది మరణించారు. బుధవారం రాజౌరి జిల్లాలోని కాలాకోట్ అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు సైనికాధికారులు, ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. జిల్లాలోని పిర్‌పంజాల్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కుకుని ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సైన్యం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. దీంతో ఇద్దరు సైనికాధికారులు, ఇద్దరు సైనికులు మరణించారు.


డిసెంబర్ 7న హాజరు కండి

- బిజెపి ఎంపి బిధూరికి లోక్‌సభ హక్కుల కమిటీ ఆదేశం

న్యూఢిల్లీ : సహచర బిఎస్‌పి ఎంపి దినిష్ అలీపై మతపరమైన దూషణలకు పాల్పడిన బిజెపి ఎంపి రమేష్ బిధూరికి లోక్‌సభ హక్కుల కమిటీ సమన్లు పంపింది. డిసెంబరు 7వ తేదీన తన ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. చంద్రయాన్-3 ప్రయోగంపై సెప్టెంబర్ 21న చర్చ సందర్భంగా బిధూరి మతపరమైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అలీని దూషించారు. 'ఈ ముల్లాను బయటికి గెంటండి. ఇతను ఓ ఉగ్రవాది' అంటూ నిందించారు. బిధూరిని వారించాల్సిన బిజెపి ఎంపీలు, మాజీ మంత్రులు రవి శంకర్ ప్రసాద్, హర్షవర్ధన్ నవ్వుతూ చూస్తుండిపోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే ఉదంతం జరిగిన తర్వాత కూడా బిధూరిని బిజెపి రాజస్థాన్‌లోని టాంక్ జిల్లాకు పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. అక్టోబర్ 11న తన ఎదుట హాజరు కావాలని హక్కుల కమిటీ గతంలోనే బిధురికి తాఖీదు పంపింది. అయితే రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో ఉన్నందున తాను రాలేనంటూ ఆయన తప్పించుకున్నారు. దీంతో వచ్చే నెల 7న హాజరు కావాలని హక్కుల కమిటీ తాజాగా ఆదేశించింది. బిధూరిపై విచారణ జరపాలని కోరుతూ సెప్టెంబర్ 24న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అలీ ఓ లేఖ రాశారు. 'బిధూరి తన ప్రసంగంలో నాపై అత్యంత తప్పుడు, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. అవి లోక్‌సభ రికార్డుల్లో ఉన్నాయి' అని ఆ లేఖలో తెలియజేశారు.

(24వ పేజీ తరువాయి)

అడవి అందం



అడవిలోన ఉండెను
ఎన్నెన్నో జంతువులు
మురిపెంగ కలిసిమెలిసి
జీవిస్తూ ఉండెను

చెట్ల పైన ఉండెను
ఎన్నెన్నో పిట్టలు
ముచ్చటైన గూళ్లు కట్టి
అందంగా ఉండెను

రామచిలకలేమో
పలుకులెన్నో పలుకును
ఆకుపచ్చ రంగులో
అందంగా ఉండెను
ఎర్రముక్కుతోని
అన్ని పండ్లు తినును


నెమలి పక్షి చూడాలే
రెండు కనులు చాలవు
పురివిప్పి ఆడుతుంటే
పుడమి పులకరించును

చెట్ల పైన కోయిల
కుహూ మంటూ కూయును
పాటలతో పలువురిని
విందు చేయుచుండును

అడవిలోని అందము
ఎంతో హాయి నిచ్చును
చూసినోళ్లందరికీ
సంతోషం కలుగును!

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
94415 61655

ఖాళీలు పూరించండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని ఆహారపదార్థాలు ఇచ్చాం. వాటి ఆంగ్ల పేర్లు కింద గళ్లలో ఉన్నాయి. ఖాళీ గడుల్లో సరైన అక్షరాలు రాస్తే వాటి పేర్లు వస్తాయి. పక్కనే ఇచ్చిన అక్షరాలతో ఆ ఖాళీలను పూరించండి మరి.


నేను గీసిన బొమ్మ





కీర్తన
ఏడవ తరగతి,
జడ్పీహెచ్ఎస్, హవేలి
ఘనపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



వైద్య సేవలో

గొప్ప దార్శనికుడు...

'దేశం నీకు ఏం చేసిందో కాదు.. దేశానికి నువ్వు ఏం చేశావో ఆలోచించు' అన్న పెద్దల వాక్కును ఎంతోమంది నిజం చేసి చూపిస్తుంటారు. తాము ఎంచుకున్న మార్గంలో జీవిత కాలం శ్రమిస్తారు. అలాంటివారిలో ఒకరు.. భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి.. డాక్టర్ ఎస్ఎస్ బద్రీనాథ్. చూపు లేని వారికి చూపు తెప్పించాలన్న లక్ష్యంతో దేశంలో కోట్లాదిమందికి ఉచిత కంటివైద్యం అందించిన 'శంకర నేత్రాలయ' వ్యవస్థాపకుడుగా ఆయన పరిచయం అవసరంలేదు. ధనిక, పేద, మధ్య తరగతి తారతమ్యాలు లేకుండా కంటివైద్యం అందించడంలో ఆ సంస్థ నాలుగు దశాబ్దాలకు పైగా ఎనలేని కృషి చేస్తోంది.

'నేను మరణించాక పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయొద్దు. నివాళులు అర్పించడం వల్ల 'శంకర నేత్రాలయం' సేవల్లో ఒక్క నిమిషం కూడా వృథా చేయొద్దు. చేతికి ఓ నల్లబ్యాండు ధరించి మీ సంతాపం తెలిపితే చాలు. నేనో సాధారణ వ్యక్తిని' అని తన మరణానంతర సేవల గురించి పరితపించిన గొప్ప హృదయమున్న వ్యక్తి బద్రీనాథ్.

ఆ జ్ఞాపకం.. చెరగని ముద్ర!

చెన్నై, ట్రిప్లికేన్‌లో 1940లో పుట్టిన బద్రీనాథ్ పూర్తి పేరు సెంగమేదు శ్రీనివాస బద్రీనాథ్. బాల్యంలోనే ఆయన తన తల్లిదండ్రులను కోల్పోయారు. తండ్రి ఇన్సూరెన్స్ డబ్బులతో చదువును కొనసాగించారు. చూపులేకపోయిన ఓ బంధువు నిస్సహాయత చిన్నారి బద్రీనాథ్ హృదయంలో చెరగని ముద్రవేసింది. 'కంటిచూపు లేని ఆ వ్యక్తి నిస్సహాయత నాలో లోతుగా పాతుకుపోయింది. బహుశా అదే నేను కంటివైద్యుడిగా మారేందుకు దోహదపడింది.' ' అని ఓ సందర్భంలో ఆయన చెప్పారు. 1962 నాటికి మద్రాస్ మెడికల్ కాలేజీలో ఆప్తల్మాలజీలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన బద్రీనాథ్, అమెరికా వెళ్లి న్యూయార్క్ యూనివర్శిటీలో పోస్టుగ్రాడ్యుయేట్ పూర్తిచేశారు. 1970 నాటికి భారత్ తిరిగివచ్చి, వివిధ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందించారు. హెచ్ఎం ఆస్పత్రిలో ఆప్తాల్మాలజీ, విట్రోరెటినల్ సర్జరీ (రెటీనా, కంటిలోని విట్రస్ అని పిలువబడే నిర్మాణాలను ప్రభావితం చేసే పరిస్థితి)లో ప్రైవేటు ప్రాక్టీస్ ప్రారంభించారు. ఎంతో నైపుణ్యంతో ఆయన చేసే కంటి శస్త్రచికిత్సలు తోటి వైద్యులను ఆశ్చర్యంలో ముంచెత్తేవి.

నేత్రాలయ స్థాపన

1974కి వచ్చేసరికి బద్రీనాథ్ జీవితం ఓ గొప్ప లక్ష్యం వైపు అడుగులు వేసింది. తన వైద్యవిద్యను ఆయన సేవామార్గం వైపు మళ్లించారు. 'ఒకసారి కంచి మఠాధిపతికి కంటి వైద్యం చేశాను. నా చికిత్స పట్ల ఆయన చాలా సంతోషించారు. నా దృఢ నిశ్చయాన్ని, అకుంఠిత శ్రమని గుర్తించిన ఆయన వైద్య సేవ వైపు వెళ్లేలా నన్ను పురికొల్పారు." అనిబద్రీనాథ్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. వైద్య సామాజికవేత్త ఎపి ఇరుంగవేల్ దృక్పథానికి ఆకర్షితులైన బద్రీనాథ్, ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించే ఆస్పత్రులు దేశానికి కావాలని అనుకున్నారు. తరువాత ఎంతోమంది ప్రేరణతో 1978లో కొంతమంది వైద్యుల బృందంతో 'శంకర నేత్రాలయ' పేరుతో మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు.

కంటివైద్యం అందించడంలో లాభాపేక్ష లేని సంస్థగా ప్రారంభించిన ఇది, స్వల్పకాలంలోనే దేశం దృష్టిని ఆకర్షించింది. విరాళాల ద్వారా నిర్మించిన ఈ సంస్థ ఒకపక్క కంటి సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తూనే మరోపక్క నేత్ర వైద్య నిపుణులను అందించడంలో ముఖ్య భూమిక పోషించింది. ఎంతోమంది వైద్య విద్యార్థులకు శిక్షణ, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు ఉచిత చికిత్స అందించింది.

దాతల పేర్లతోనే..

నేత్రాలయంలో భవనాలు, గదులు, బ్లాకు, ఆపరేషన్ థియేటర్, ఇలా ప్రతి ఒక్కటి వివిధ పేర్లతో కనిపిస్తుంటాయి. దేశవిదేశాల నుండి విరాళాలు అందించిన దాతల సాయానికి కృతజ్ఞతగా వారి పేర్లతోనే వాటిని నిర్మించడం నేత్రాలయం ప్రత్యేకత. 'ఈ రోజు ఉచిత వైద్యచికిత్సలకు నిధులు అందించిన వారు' అంటూ ఏరోజుకారోజు అక్కడ నోటీసు బోర్డులో దాతల వివరాలు రాస్తుంటారు. ప్రముఖ న్యాయనిపుణులు, నాని ఎ పాల్ఖివాలా 1992లో ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ అందించే సేవలు చూసి చలించిపోయిన ఆయన తన యావదాస్తిని సంస్థకు విరాళంగా ప్రకటించారు. ఇప్పుడు అక్కడ ఆయన పేరుతో ఓ భవనం ఉంది.

అవార్డులు

దేశానికి ఇంత విశేష సేవలందించిన బద్రీనాథ్‌కి గౌరవసూచకంగా 1983లో 'పద్మ శ్రీ', 1991లో డాక్టర్ బి సి రాయ్ అవార్డు, 1999లో పద్మభూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం సత్కరించింది. బద్రినాథ్, 2019 నుండి క్రియాశీలక పనుల నుండి విశ్రాంతి తీసుకున్నారు. అయినా ఆయన విజన్ ఎంతోమంది సేవల్లో ప్రతిబింబిస్తోంది.

నిధుల సేకరణతో ...

కర్నాటక సంగీతాన్ని అమితంగా ప్రేమించే బద్రీనాథ్, నిధుల సేకరించేందుకు అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేవారు. 2016లో ఎంఎస్ సుబ్బలక్ష్మి శతజయంతిని పురస్కరించుకుని ఓ సంగీత కచేరిని ఏర్పాటు చేశారు. అక్కడ దాతలు ఇచ్చిన విరాళాలతో 3 వేల మందికి ఉచిత కంటి శుక్లం శస్త్రచికిత్సలు నిర్వహించారు.

బద్రీనాథ్ ఎప్పుడు మాట్లాడినా– ఆ వ్యాఖ్యలు ఎంతో ఆధ్యాత్మికంగా సాగేవి. ఆధ్యాత్మికత అంటే ఒక మతం వారిని ప్రేమించడం, మరో మతం వారిని ద్వేషించడం కాదని ఆయన సేవతో నిరూపించారు. మనుషులను ప్రేమించడం, సేవ చేయడమే తన మార్గమని, కుల, మతాల తేడా లేకుండా సేవా మార్గం వైపు పయనించిన గొప్ప దార్శనికుడిగా గుర్తింపు పొందారు.

ఏటా వేలాది శస్త్రచికిత్సలు

ఇక్కడ శిక్షణ తీసుకుని, ఇప్పటివరకు వెయ్యిమందికి పైగా ప్రొఫెషనల్స్ గ్రాడ్యుయేట్ అయ్యారు. శంకర నేత్రాలయ దేశం నలుమూలలకు సేవలు విస్తరిస్తూ ఏడాదికి 36 వేలకు పైగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. అందులో 12 వేలకు పైగా ఉచితంగా చేస్తోంది. వీటిలో 80 శాతం ఆపరేషన్లు కాటారాక్ట్ చికిత్సలే. 20 శాతం అత్యంత కఠినతర శస్త్రచికిత్సలు.

కంటి సమస్యల్లో క్యాటరాక్‌తో బాధపడేవారు ఎక్కువగా ఉంటారు. మనదేశంలో ఆ సమస్య మరింత ఎక్కువ. దీనిమీదే నేత్రాలయ అవిశ్రాంతంగా సేవలందిస్తోంది. రోగులకు ఉచితంగా ఆహారం, మందులు కూడా అందిస్తోంది. ఇంకా నేత్రాలయానికి వచ్చి వైద్యం చేయించుకోలేని బాధితులకు సేవలు అందించడమే లక్ష్యంగా వాడవాడలకు సేవలు విస్తరిస్తోంది. మొబైల్ వ్యాన్ ద్వారా తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్నాటక మారుమూల గ్రామాలకు వెళ్లి సేవలు అందిస్తోంది. అలా దాదాపు 3 లక్షల మంది గ్రామీణులకు కంటి చికిత్సలు అందించింది. 10 వేలకు పైగా కళ్లాద్దాలు అందించింది. పిల్లల కంటి చికిత్సల్లో కూడా నేత్రాలయం కృషి చేస్తోంది. చూపు కోల్పోయిన 40 లక్షల మందికి పైగా చిన్నారులకు తిరిగి చూపును అందించింది.

దేశవ్యాప్త సేవలు

బద్రీనాథ్ స్వస్థలం తమిళనాడులో 'శంకర నేత్రాలయ' ఐదు కేంద్రాలను నిర్వహిస్తోంది. కోల్‌కత్తా, ఆంధ్రప్రదేశ్, అసోంలో కూడా కేంద్రాలున్నాయి. 1998లో దేశంలో అత్యధిక సంఖ్యలో కార్నియల్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు నిర్వహించి రికార్డు నెలకొల్పింది. సేకరించిన మొత్తం 536 నేత్రాలలో 402 ట్రాన్స్‌ప్లాంట్లు చేసింది. ఆ సంస్థ ఉచిత వైద్య శిబిరాలు అనేక జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో దేశ నలమూలలకు వ్యాపించాయి. దేశంలో ఎంతోమందిని అంధత్వం నుంచి కాపాడాయి.



'శంకర నేత్రాలయ'లో నటుడు కార్తీ

పారదర్శకంగా కులగణన

గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అడిషనల్ డైరెక్టర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కులగణన సర్వే పారదర్శకంగా జరగాలని, అందుకు తగ్గట్లు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ అడిషనల్ డైరెక్టరు ధ్యానచంద్ర పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన కులగణన పైలెట్ సర్వేపై విజయవాడలోని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న సర్వే కోసం శ్రీకాకుళం, అంబేద్కర్ కోనసీమ, ఎన్‌టిఆర్, నెల్లూరు, వైఎస్ఆర్ జిల్లాల నుంచి ఒక్కో సచివాలయాన్ని ఎంపిక చేసి పైలెట్‌గా సర్వే చేయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రూపొందించిన యాప్‌లో సర్వే కోసం అన్ని రకాల ప్రశ్నలను చేర్చడంతోపాటు ఇకెవైసి నమోదు చేయాలన్నారు. సర్వే సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారి గుర్తింపు కోసం ఫేషియల్, ఒటిపి, వేలిముద్రలు, ఐరీష్ సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు. సమీక్షా సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ డైరెక్టరు జెవి మురళీ, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డిజిటల్ సర్వీసెస్ ఇన్‌ఛార్జి రామ్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే 'అటల్ ల్యాబ్స్' లక్ష్యం

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ అన్నారు. ల్యాబ్‌లపై రాష్ట్రస్థాయి సమావేశం బుధవారం విజయవాడలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సైన్స్ పట్ల విద్యార్థుల్లో అభిరుచి కల్పించడమే ఉపాధ్యాయుల వంతు అని అన్నారు. ఇటీవల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు ముగ్గురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జపాన్ వెళ్లడం అభినందనీయమని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి విద్యార్థులకు కావాల్సిన ఆత్మస్థైర్యం ఈ ల్యాబ్ ద్వారా అందుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 577 ల్యాబ్‌లు ఉన్నాయని, వీటిల్లో 31 హబ్‌ఎటిల్‌గా గుర్తించామని చెప్పారు. జిల్లా స్థాయి సైన్స్ పోటీల విజేతలను ఆ జిల్లాల కలెక్టరుతో సమావేశపరిస్తే విద్యార్థుల్లో మరింత ఉత్సాహం పెంపొందుతుందని తెలిపారు. సమగ్ర శిక్ష డైరెక్టరు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సైన్స్ ద్వారా విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేయాలని చెప్పారు. కొన్ని పాఠశాలల్లో సైన్స్ పరికరాలను ఉపయోగించడం లేదని అన్నారు. ల్యాబ్‌ల వినియోగంలో దేశవ్యాప్తంగా ఎపి ముందంజలో ఉందని అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఎఐఎం) డైరెక్టర్ దీపాళి ఉపాధ్యాయ్ అన్నారు. ల్యాబ్ నిర్వహణ 13 సూచికల పోస్టరును ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి ప్రతాప్ రెడ్డి, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టరు విజయ భాస్కర్, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు విదేశీ భాషల అధ్యయనంపై ఇఫ్లుతో సమావేశం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విదేశీ భాషల అధ్యయనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు, యువతకు విదేశీ భాషలను నేర్పించే అవకాశాలపై కమిషనర్ సురేష్‌కుమార్ ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లు) విసి ఇ సురేష్‌కుమార్‌తో బుధవారం హైదరాబాద్‌లో చర్చించారు. సిబిఎస్ఇకి అనుసంధానమైన 1000 పాఠశాలల్లో విద్యార్థులకు ఐచ్ఛిక భాషగా జర్మన్, ఫ్రాన్స్, స్పెయిన్, జపనీస్, మాండరీస్, కొరియన్ దేశాల భాషల అధ్యయన అవకాశాలను చర్చించారు. త్వరలో నిర్ణయం తీసుకుని కార్యాచరణను ప్రకటిస్తామని సురేష్‌కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి ప్రతాప్ రెడ్డి, అసెస్మెంట్స్ ఇన్‌ఛార్జి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దిక్కుతోచని స్థితిలో వైసిపి

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

దెబ్బమీద దెబ్బతో దిక్కుతోచని స్థితిలో వైసిపి ఉందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. తమ పార్టీ చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణ, స్వచ్ఛంధంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటుంటే బులుగు మందకు నిద్ర కరువైందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొన్నటి వరకు గడపగడపకూ వెళ్లిన వైసిపి నేతల్ని ప్రజలు ప్రశ్నలు, నిలదీతలతో ఉక్కపోత పుట్టించారని విమర్శించారు. ప్రజలకు చేసే మేలు గురించే చెబుతుంటే జగన్‌కు ఇంత అక్కసు ఎందుకని అన్నారు. టిడిపి–జనసేన ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు అందిస్తామంటే వైసిపి నేతలకు నొప్పేంటని టిడిపి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. భవిష్యత్ గ్యారెంటీ–బాబు ష్యూరిటీ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక సజ్జల అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు.

బిసిల్లో ఐక్యత చెడగొడుతున్న ఆర్ కృష్ణయ్య : కొల్లు రవీంద్ర

వ్యక్తిగత లబ్ధి కోసం జగన్ కుట్రలో పావుగా మారి రాష్ట్రంలోని బిసిల్లో ఐక్యత చెడగొట్టేందుకు ఆర్ కృష్ణయ్య దిగజారారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర విమర్శించారు. ఈ మేరకు సిఎం జగన్‌కు బుధవారం ఆయన లేఖ రాశారు. నాలుగున్నరేళ్ల పాలనలో బిసిలకు అన్యాయం, దగా తప్ప చేసేందేంటని ప్రశ్నించారు. ఎఎజి పొన్నవోలు సుధాకర్ న్యాయవాద వృత్తికే కలంకం తీసుకొస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు.

కేంద్ర పథకాలను పటిష్టంగా అమలు చేయండి

బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర సహాయ పథకాలను రాష్ట్రంలో పటిష్టంగా అమలు పరచాలని, వాటి అమలులో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే రాష్ట్ర స్థాయి దిశ కమిటీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి దిశ కమిటీ (డిస్ట్రిక్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ అడ్వైజరీ) మొదటి సమావేశం మంత్రి అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర సహాయ పథకాల అమలు తీరును పర్యవేక్షించడం, వాటి ఫలాలు ప్రజలకు చేర్చడంలో దిశ కమిటీ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో కేంద్ర సహాయ పథకాల అమల్లో ఎదురవుతున్న సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చి వాటిని తక్షణమే పరిష్కరించుకోవాలన్నారు.

యువ క్రికెటర్లకు పరీక్ష

సూర్యకుమార్‌కు పగ్గాలు
నేడు ఆస్ట్రేలియాతో తొలి టి20
రాత్రి 7.00గం॥ల నుంచి



విశాఖపట్నం: ఐసిసి వన్డే ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియాతో టి20 సమరానికి టీమిండియా సిద్ధమైంది. వన్డే ప్రపంచకప్‌లో ఆడిన సూర్య కుమార్, ఇషాన్ మినహా.. మిగిలిన క్రికెటర్లందరూ విశ్రాంతి కోరుకోవడంతో యువ క్రికెటర్లతో ఆసీస్‌తో పోరుకు టీమిండియా సిద్ధమైంది. అలాగే కోచ్ రాహుల్ ద్రావిడ్ కూడా ఈ సిరీస్‌కు దూరంగా ఉండడంతో వివిఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇక మిస్టర్ 360 డిగ్రీస్‌కు తొలిసారి భారత పగ్గాలు దక్కాయి. ప్రపంచకప్‌లో నిరాశపరిచిన సూర్యకుమార్‌తో పాటు ఒక్క మ్యాచ్‌లోనూ చోటు దక్కని ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరమెంతైనా ఉంది. మరోవైపు యువ క్రికెటర్లు జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, బిష్ణోయ్ తదితర ఆటగాళ్లకు ఈ సిరీస్ ఓ సవాలుతో కూడుకున్నది. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు వన్డే ప్రపంచకప్‌ను నెగ్గిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. కెప్టెన్ కమిన్స్, స్టార్క్, లబూషేన్, వార్నర్, మార్ష్ వన్డే ప్రపంచకప్ ముగిసాయ స్వదేశానికి తిరిగి వెళ్లారు. మిగిలిన ఆటగాళ్ళతో ఆ జట్టు టి20 సిరీస్‌కు సిద్ధ మౌతోంది. ఇక ఆసీస్ సీనియర్ వికెట్ కీపర్, బ్యాటర్ మాథ్యూ హెడ్ ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇరుజట్ల మధ్య ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి టి20 విశాఖపట్నం లోని ఎసిఎ–విడిసిఎ క్రికెట్ అకాడమీలో జరగనుంది.

దక్షిణాఫ్రికా సిరీస్‌కు హార్దిక్ దూరం

టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఇంకా గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. వన్డే ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా గాయపడ్డ హార్దిక్.. గురువారం నుంచి ఆస్ట్రేలియాతో జరిగే టి20 సిరీస్‌తో పాటు సౌతాఫ్రికా టూర్‌కు దూరంగా ఉండనున్నాడు. దీంతో అతడు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లోనే తిరిగి బ్యాట్ పట్టనున్నట్లు సమాచారం. భారత జట్టు ఆసీస్‌తో టి20 సిరీస్ ముగిసిన తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఆ తర్వాత జనవరిలో స్వదేశంలో అఫ్గాన్‌తో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్.. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుండగా.. ఆ సిరీస్‌లకు అతడు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది సందేహాస్పదమే. పాండ్యాకు మరింత విశ్రాంతి అవసరమని, వచ్చే ఏడాది జూన్‌లో భారత జట్టు టీ20 వరల్డ్ కప్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పాండ్యాను మధ్యలో ఆడించి గాయాన్ని పెద్దది చేసేదానికంటే ప్రస్తుతానికి అతడికి విరామ మిచ్చిందే బెటర్ అన్న యోచనలో బిసిసిఐ ఉన్నట్టు తెలుస్తోంది.

జట్లు:

భారత్: సూర్యకుమార్(కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్, జైస్వాల్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, ముఖేష్ కుమార్, వాషింగ్టన్ సుందర్, ఆవేశ్ ఖాన్, గైక్వాడ్, జితేశ్ శర్మ.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్(కెప్టెన్, వికెట్ కీపర్), హెడ్, షార్ట్, స్మిత్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, స్టొయినీస్, టిమ్ డేవిడ్, అబట్, జంపా, ఎల్లిస్, బెహ్రెన్ డార్ఫ్, సాంఘ్వా, జెన్సన్, హెర్డే.

తొలిరౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, లక్ష్యసేన్

హాంగ్జౌ: చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు రెండోరోజు నిరాశ తప్పలేదు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్ పోటీలో కిదాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజవత్ ఓటమిపాలయ్యారు. ప్రియాన్షు రాజవత్..17–21, 14–21 తేడాతో జపాన్‌కు చెందిన కెంటా నిసిమోటో చేతిలో, లక్ష్యసేన్ 19–21, 18–21 తేడాతో చైనాకే చెందిన షి–యు–కి చేతిలో వరుససెట్లలో పరాజయాన్ని చవిచూశారు. ఇక కిదాంబి శ్రీకాంత్ 15–21, 21–14, 13–21 తేడాతో థాయ్‌లాండ్‌కు చెందిన కున్లావత్ వితిద్సరన్ చేతిలో పోరాడి ఓడాడు. మంగళవారం హెచ్ఎస్ ప్రణయ్.. పురుషుల డబుల్స్‌లో చిరాగ్–సాత్విక్ గెలిచి రెండోరౌండ్‌కు చేరిన సంగతి తెలిసిందే.

విశాఖలో ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు

- న్యాయ నిర్ణేతగా సుధాకర్ ఎంపిక

ప్రజాశక్తి–హనుమాన్‌జంక్షన్



19వ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్–2023 పోటీలు ఈ నెల 24, 25, 26 తేదీల్లో విశాఖపట్నంలోని పోర్టు స్టేడియంలో జరగనున్నాయి. ఈ పోటీలకు భారతదేశం తరుపున కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ కోచ్ కట్టా సుధాకర్ న్యాయ నిర్ణేతగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను ఎపి న్యూ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ గంటా నూకరాజు, ఎపి వడకై డైరెక్టర్ అండ్ చీఫ్ సిహెచ్ సతీష్‌కుమార్, తదితరులు అభినందించారు. కోచ్ సుధాకర్ మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్టమొదటిసారి 15 దేశాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. అలాంటి పోటీలకు తాను న్యాయనిర్ణేతగా ఎంపికవ్వడం గర్వంగా ఉందన్నారు.

బెంగాల్ వారియర్స్ కెప్టెన్‌గా మణీందర్ సింగ్

ప్రొ కబడ్డీ సీజన్–10

ముంబయి: ప్రొ కబడ్డీ సీజన్–10 బెంగాల్ విరాయర్స్ కెప్టెన్‌గా మణిందర్ సింగ్ ఎంపికయ్యాడు. రైడర్ మణిందర్ సింగ్‌ను బెంగాల్ ఫ్రాంచైజీ రూ.2.120కోట్లకు వేలంలో కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. మణిందర్ సింగ్ 2017నుంచి బెంగాల్ తరపున ఆడుతున్నాడు. 33ఏళ్ల మణిందర్ ప్రొ కబడ్డీ చరిత్రలో 1000 పాయింట్లు సాధించిన వారియర్స్ తొలి ఆటగాడు. ప్రొ కబడ్డీ సీజన్–10 టోర్నీ డిసెంబర్ 2నుంచి అహ్మదాబాద్‌లో ప్రారంభం కానుంది. బెంగాల్ వారియర్స్ జట్టు పికెల్ సీజన్–10లో తన తొలి లీగ్ మ్యాచ్‌ను డిసెంబర్ 4న బెంగళూరు బుల్స్‌తో తలపడనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68